J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 21 27.10.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




# తెరపై తెలుగుసేన

## సైకిలుతో గ్లాసు... కలసిపోయిన క్లాసు.. మాసు!!



***ఆంధ్ర అసెంబ్లీకి రానున్న ఎన్నికలలో వైసీపీని ఓడించాలనే ఏకైక లక్ష్యం దిశగా... తెలుగుదేశం, జనసేన పార్టీలు నిర్ణయాత్మకమైన అడుగు వేశాయి. 'తెలుగు సేన' నినాదంతో ఓటర్ల ముందుకు వెళ్ళనున్నట్టు పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ముక్తకంఠంతో ప్రకటించారు. ఆ రెండు పార్టీల ఎన్నికల పొత్తుకు సంబంధించి, ఇదే తొలి అధికారిక ప్రకటన.***

'వైసీపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటును చీలిపోనివ్వను' అంటూ గత రెండేళ్లుగా చెప్తూనే వస్తున్న పవన్ కళ్యాణ్ అన్నంత పనీ చేశారు.

ఈ లక్ష్యం దిశగా మొన్న సోమవారం నాడు టీడీపీతో కలిసి రాజమండ్రిలో కూర్చోవడం ద్వారా అద్భుతమైన రాజకీయ పరిణతి ప్రదర్శించి, ఒక కొత్త రాజకీయ ప్రక్రియకి శ్రీకారం చుట్టారన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. మామూలుగా అయితే, పవన్ కళ్యాణ్ అంటే... ఒక ఆవేశం, ఒక దూకుడు, ఒక కోలాహలం, ఒక రాజకీయ తిరునాళ్ళ, ఒక అసంబద్ధ ప్రకటనల సమాహారం. కానీ, రాజమండ్రిలో ఇవేమీ మచ్చుకు కూడా కనిపించలేదు.

అంతులేని సంయమనం. పొదుపుగా వాడిన మాటలు..., హావభావాలు.., ఆవేశ రహిత నిగ్రహం, మొహంలో వైసీపీని ఓడించబోతున్నామనే ఆత్మవిశ్వాసం, హాజరైన తెలుగుదేశం నేతల పట్ల అంతులేని మర్యాద, మన్ననలతో కూడిన సంబోధనలతో... ఒక కొత్త... వాస్తవిక ఆలోచనల పవన్ కళ్యాణ్ కనిపించారన్నది వారి భావన.

'మేము...' అనే పవన్ కళ్యాణ్ తప్ప 'నేను....' అనే పవన్ కళ్యాణ్ ఎక్కడా కనిపించలేదు. ఈ పరిణామం ఇంత తొందరగా చోటు చేసుకుంటుందని రాజకీయ వర్గాల వారు కూడా ఊహించి ఉండకపోవచ్చు.

ఇందుకు కారణం లేకపోలేదని కూడా విశ్లేషకులు అంటున్నారు.

గత కొన్ని నెలలుగా అభిమానుల "మనోభావాలకు అనుగుణంగా" పవన్ కళ్యాణ్ ఒక్కోచోట ఒక్కో రకమైన ప్రకటన చేస్తూ వచ్చారు. "ముఖ్యమంత్రి పదవి ఇస్తే, సంతోషంగా స్వీకరిస్తా" అని ఒకసారి అన్నారు. "మీరు కావాలి అనుకుంటే ముఖ్యమంత్రి అవుతా..." అని మరోసారి అన్నారు.

చాలామందికి అయోమయంగా, అసంబద్ధంగా కనపడిన పవన్ కళ్యాణ్ ప్రకటనలపై తెలుగుదేశం పార్టీ ఏ స్థాయిలోనూ స్పందించకపోవడంతో... ఈ రెండు పార్టీల మధ్య అసలు పొత్తు ఉంటుందా...? లేదా?? అంటూ చాలా మంది సందేహాలకు లోనవుతూవచ్చారు. దీనికితోడు పవన్‌పై వైసీపీ వర్గీయుల మాటల దాడులు ఒక రేంజ్‌లో సాగాయి (సాగుతూనే వున్నాయి).

"దమ్ముంటే 175 సీట్లకు పోటీ చెయ్యి" అంటూ సవాళ్లు విసిరారు. 'ప్యాకేజ్ స్టార్' అన్నారు. 'చంద్రబాబుకు దత్తపుత్రుడు' అని, 'చంద్రబాబుకు కాపుల్ని తాకట్టు పెడతాడని', 'కార్లు మార్చినట్టు పెళ్ళాల్ని మారుస్తాడని' ఇలా వివిధ కోణాలలో పవన్‌ను గేలిచేస్తూ, రెచ్చగొట్టే ప్రయత్నాలు గట్టిగానే జరిగాయి.

10లో



## 10వ వర్ధంతి



అనురాగమూర్తి... ఆత్మీయదీప్తి...

అమ్మ

ఆమె ప్రేమానురాగాలే మాకు స్ఫూర్తి
ఆమె నడిపించిన బాటే మాకు కీర్తి

కీ॥శే॥ శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మ గారు

నిర్యాణం: 01-11-2013

కుమారుడు
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
రాజ్యసభ సభ్యులు

# జిల్లాకు 'జగనన్న చేదోడు' రూ. 18.09 కోట్లు



జగనన్న చేదోడు పథకంలో భాగంగా జిల్లాలోని ఆ పథకం లబ్దిదారులకు ఇటీవల రూ. 18.09 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లోకి బటన్‌నొక్కి జమ చేశారు. మొత్తం 18,090 మందికి ఈ సాయం అందుతుందని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. పేద, బడుగు, బలహీనవర్గాల వారి అభ్యున్నతి కోసం ఏడాదికి 10వేల రూపాయల వంతున గత నాలుగు సంవత్సరాల్లో రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు సీఎం జగన్ 1252 కోట్ల రూపాయలను అందజేశారని ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు నెల్లూరు కలెక్టర్‌లో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి చేతులమీదుగా లబ్దిదారులకు మెగా చెక్కును అందజేశారు.

# నెల్లూరు డీఆర్ఓగా లవన్న



నెల్లూరుకు కొత్త డిఆర్ఓ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డిఆర్ఓ వెంకటనారాయణమ్మను అనంతపురం జిల్లా పర్యాటకశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీచేసి, గుంతకల్ ఆర్డీఓగా పని చేస్తున్న ఎస్.లవన్నను నెల్లూరు ఆర్డీఓగా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా రాష్ట్రప్రభుత్వం తాజాగా ఈ బదిలీలు చేసింది. పౌరసరఫరాల శాఖ(విజిలెన్స్) డిప్యూటీ కలెక్టర్ ఎం.వి సుధాకర్‌ను రాజమహేంద్రవరానికి బదిలీ చేశారు. రాపూరు తెలుగుగంగ డిప్యూటీ కలెక్టర్ రాజారమేష్ ప్రేమ్‌కుమార్‌ను ఆత్మకూరు తెలుగుగంగ విభాగానికి మార్చారు. ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారిని అనంతపురం ఏఎన్ఐటి సిఇఓగా బదిలీ చేశారు. రామాయపట్నం భూసేకరణ విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా గతంలో విధులు నిర్వహించిన టి.పద్మావతికి మళ్లీ అక్కడే పోస్టింగ్ ఇచ్చారు.

# అదాని వరల్డ్‌స్కూల్‌లో.. ఫుట్‌బాల్ టోర్నీ సందడి





ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం వద్ద ఉన్న అదాని వరల్డ్ స్కూల్‌లో ఇటీవల సిబిఎస్ఇ క్లస్టర్–7 అండర్–19 జోనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్స్ సందడిగా జరిగాయి. ఈనెల 16వ తేదీ నుంచి నాలుగురోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 62 పాఠశాలలకు చెందిన వెయ్యిమందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల్లో విశాఖపట్నంలోని నేవీ చిల్డ్రన్స్ స్కూల్ జట్టు ప్రథమ స్థానం సాధించి చాంపియన్‌గా నిలిచింది. రాజమండ్రి శ్రీ సత్యసాయి గురుకుల్, ఆర్‌కే పురం ఆర్మీ పబ్లిక్‌స్కూల్ జట్లు వరుసగా ద్వితీయ, తృతీయస్థానాలను కైవశం చేసుకున్నాయి. నేవీ చిల్డ్రన్‌స్కూల్‌కు చెందిన భవేష్ బెస్ట్ గోల్‌కీపర్‌గా అవార్డును సొంతం చేసుకోగా, సత్యసాయి గురుకుల్ విద్యార్థి బెస్ట్ గోల్ స్కోరర్‌గా బహుమతినందుకున్నాడు. అదాని వరల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీలో విజేతలకు అదాని కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, జిందాల్ పవర్‌ప్లాంట్ హెడ్.శ్రీనివాసరావు పాల్గొని ట్రోఫీలు ప్రదానం చేసి విజేతలను అభినందించారు. పోర్టు హెచ్‌ఆర్ హెడ్ విల్సన్, పోర్టు సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కర్, రామానందయాదవ్, అదాని వరల్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ సిరియాల సత్యనారాయణ, టోర్నీ అబ్జర్వర్ సిహెచ్ మధు తదితరులు పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

నెల్లూరులోని పలు స్కానింగ్ సెంటర్‌లను ఇటీవల వైద్యబృందం తనిఖీలు చేసింది. పీసీ, పిఎన్‌డీటి కింద రిజిస్టర్ రెన్యువల్ చేసుకున్న స్కానింగ్ సెంటర్ల నిర్వహణకు సంబంధించిన అన్ని రికార్డులను డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్ ఎం.రమేష్ బృందాలు పరిశీలించాయి. అనుమతి కోసం వచ్చిన దరఖాస్తులను, విద్యార్హతలు, స్కానింగ్ మిషన్ల వివరాలు వగైరాలన్నిటినీ వారు నమోదు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ తనిఖీల్లో వైద్యఆరోగ్యశాఖ డెమో అధికారి బి.శ్రీనివాసరావు, కనకరత్నం, ఐ. శ్రీనివాసరావు, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా ప్రపంచ నృత్యదినోత్సవం

ప్రపంచ నృత్యదినోత్సవం సందర్భంగా ఈనెల 22న నెల్లూరు టౌన్‌హాలులో ప్రముఖ నాట్యాచార్యుడు దేగల సాంబశివరావు ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నాట్య ప్రదర్శనలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాంబశివరావును విశిష్ట కళారత్న, సమాజ సేవకుడు షబ్బీర్‌ను విశిష్ట సేవారత్న బిరుదులతో సత్కరించారు. నగర మేయర్ స్రవంతి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## 'గగన్‌యాన్'కు

# విజయవంతంగా.. తొలి అడుగులు

## టెస్ట్ రాకెట్..టీవీ–డీ1 సక్సెస్

### సమస్య ఎదురైనా.. సమర్థవంతంగా సరిదిద్దిన శాస్త్రవేత్తలు

***భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) చేపట్టిన గగన్‌యాత్రకు విజయవంతంగా అడుగులు పడుతున్నాయి. ఈనెల 21న షార్ నుంచి గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ ప్రయోగం స్వల్ప లోపంతో కాస్త ఆలస్యమైనా, చివరికి జయప్రదం కావడంతో శాస్త్రవేత్తల్లో మరింత ఉత్సాహం నెలకొంది. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షంలో 4 వందల కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి పంపి, మళ్లీ వారిని సురక్షితంగా భూమిపైకి తీసుకురావాలన్నదే లక్ష్యంగా ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న ఈ ప్రయోగాల్లో మొదటిపరీక్ష ఫలప్రదం కావడం విశేషం.***

ఇటీవలే చంద్రయాన్ దిగ్విజయమై ఇస్రో ఖ్యాతి ప్రపంచవ్యాప్తమైన సంగతి తెలిసిందే. చంద్రయాన్‌తో పాటు గగన్‌యాన్‌కు కూడా ఇస్రోలో ఎంతోకాలంగా పరిశోధనలు జరుగుతున్నాయి. అంతరిక్షంలోకి మానవులను పంపించాలన్న ధ్యేయంతో ఇస్రో చేసిన తొలి ప్రయత్నమిది. మానవ సహిత వ్యోమగాములను రోదసిలోకి పంపి, వారిని తిరిగి సురక్షితంగా భూమి మీదకు తీసుకురావాలంటే, రాకెట్‌లో ఉన్న క్రూ మాడ్యూల్ వ్యవస్థ ఎలాంటి లోపాలు లేకుండా ఉండాలి. అందుకు సంబంధించిన తొలి పరీక్ష ఇదే. ఈ ప్రయోగపరీక్ష ఎంతో క్లిష్టమైనది కూడా. అందులోనూ, ఇక 8 సెకన్లలోనే రాకెట్ నింగిలోకి దూసుకువెళ్ళాల్సిన తరుణంలో ఊహించనివిధంగా సాంకేతిక సమస్య ఎదురుకావడం, వెంటనే శాస్త్రవేత్తలు గమనించి ప్రయోగాన్ని నిలిపేసి లోపాన్ని సరిదిద్ది రెండుగంటల తర్వాత రాకెట్‌ను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపడం జరిగాయి. ఈ దశలో శాస్త్రవేత్తల్లో ఉత్కంఠ నెలకొంది.

## రివ్వుమంటూ రోదసిలోకి :

శ్రీహరికోటలోని షార్ మొదటి ప్రయోగవేదిక మీద నుంచి టీవీ–డీ1 సింగిల్ స్టేజ్ లిక్విడ్ రాకెట్ (గగన్‌యాన్ టెస్ట్ రాకెట్) ఈనెల 21న ఉదయం 10 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకువెళ్ళింది. అనంతరం కేవలం 8 నిమిషాల 35 సెకన్లలోనే 17 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్ళి అనుకున్న ప్రకారం రాకెట్ నుంచి క్రూ మాడ్యూల్‌ను విడిచిపెట్టింది. రాకెట్ నుంచి విడిపోయిన క్రూ మాడ్యూల్ పారాచ్యూట్ల సాయంతో సముద్ర ఉపరితలంపై సురక్షితంగా దిగడంతో శాస్త్రవేత్తలతో పాటు, ప్రసార మాధ్యమాల్లో ఆ దృశ్యాలను చూస్తున్న వీక్షకుల్లో సంతోషం వెల్లువెత్తింది. ఇస్రో ఛైర్మన్ డా.ఎస్ సోమనాథ్



సురక్షితంగా సముద్రజలాల్లో దిగిన క్రూ మాడ్యూల్

ఈ ప్రయోగం విజయవంతమైందని ప్రకటించడంతో అందరూ కరతాళధ్వనులతో శాస్త్రవేత్తలను అభినందించారు. సముద్ర ఉపరితలానికి చేరుకున్న క్రూ మాడ్యూల్‌ను నౌకాదళ సిబ్బంది చెన్నై పోర్టుకు తీసుకువచ్చారు. ఈ ప్రయోగం ద్వారా వ్యోమగాముల భద్రతకు సంబంధించిన వ్యవస్థ సమర్థవంతంగా ఉందా లేదా అనే అంశాన్ని విశ్లేషించుకున్నారు. అందుకోసం మెరుపువేగంతో పనిచేసే సాంకేతిక వ్యవస్థను క్విక్ రియాక్టింగ్ సాలిడ్ మోటార్లను ఇస్రో స్వయంగా అభివృద్ధి చేసి, తొలిపరీక్షలోనే విజయం సాధించింది. గగన్‌యాన్ ప్రయోగానికి ముందు ఇలాంటి మరిన్ని ముఖ్యమైన పరీక్షలు చేపట్టాల్సి వుందని ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# నిరాశ్రయులకు అన్నదానం

పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ నెల్లూరులోని పాత మునిసిపల్ కార్యాలయం వద్ద ఈనెల 22న ఎస్‌కేబి చారిటబుల్ ట్రస్ట్ వారు నిరాశ్రయులకు అన్నదానం చేశారు. టూటౌన్ ఎస్ఐ శివ పాల్గొని సమాజ సేవకే అంకితమైన పోలీసు అమరవీరుల సేవలను తలచుకుంటూ అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు అల్లావుద్దీన్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, అజీజ్ అహ్మద్, జియా, షానవాజ్, మున్నా, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో..

# పారిశుద్ధ్య కార్మికుని కన్నుమూత

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ, నిత్యం చెత్తను పరిశుభ్రం చేసే ఓ పారిశుద్ధ్య కార్మికుడు దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యాడు. ఈనెల 21న నెల్లూరులోని జేవీఆర్ కాలనీ వద్ద చెత్తను శుభ్రం చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. నగరంలోని క్రాంతినగర్‌కు చెందిన భార్యాభర్తలు పి.కృష్ణ–వెంకటలక్ష్మి ఇద్దరూ కాంట్రాక్ట్ పద్ధతిపై గత కొద్ది సంవత్సరాలుగా స్వీపర్లుగా పనిచేస్తున్నారు. కృష్ణ ఆ కాలనీలో వీధులు చిమ్ముతుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటనతో కార్పొరేషన్ పారిశుద్ధ్య విభాగంలో విషాద వాతావరణం అలుముకుంది. సౌత్ ట్రాఫిక్ ఎస్ఐ ఎం.వెంకటరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

# కన్నులపండువగా శోభాయాత్ర



శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నెల్లూరు, దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం అమ్మవారి నామోచ్ఛారణలతో మార్మోగింది. ఈ సందర్భంగా భవానీ మాలధారణ చేసిన సుమారు 3వేల మంది భక్తులతో నగరంలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి సేవాసమితి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన శోభాయాత్ర కన్నులపండువగా ఉండి భక్తాదులను ఆకట్టుకుంది. తొలుత, సేవాసమితి అధ్యక్షులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో భక్తులు 1008 కలశాలతో అమ్మవారి మహాభిషేకం కోసం రంగనాయకులపేటలోని పెన్నానది జలాలను కలశాలలో నింపి, వాటిని తలపై మోసుకుంటూ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరిదేవి దేవాలయం వరకు దారిపొడవునా జై భవానీ!..జైజై భవాని అంటూ అమ్మవారి నామస్మరణలతో అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. మంగళవాద్యాలు, బాణసంచా వేడుకలతో సాగిన ఈ శోభాయాత్రలో ప్రముఖ దాత ఆల్తూరు సురేష్‌రెడ్డి, కొలపర్తి రమేష్ తదితరులతో పాటు పెద్దసంఖ్యలో మహిళాభక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# జగన్‌ని కలిసిన బాబాయ్, అబ్బాయ్!





మేకపాటి రాజమోహన్‌రెడ్డి రాజకీయ వారసులు ఆయన కుమారుడు, ఆత్మకూరు ఎంఎల్ఏ విక్రమ్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి సోదరుడు ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాజగోపాలరెడ్డిలు అక్టోబర్ 25వ తేదీ బుధవారం తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ని కలిశారు. ఉదయగిరి ప్రస్తుత శాసనసభ్యుడు మేకపాటి శేఖర్‌రెడ్డి అటు తన కుటుంబంపైనా, ఇటు వైసీపీపైనా తిరుగుబాటు చేసిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో వైసీపీ ఉదయగిరి సీటు ఎవరిని వరిస్తుందా..? అని ఆ పార్టీ వర్గాలు ఎదురు చూస్తున్న తరుణంలో రాజమోహన్‌రెడ్డి మూడవ సోదరుడిని మేకపాటి కుటుంబం తెరపైకి తెచ్చిన విషయం తెలిసిందే. గతంలో ఆ కుటుంబం నుండి ముగ్గురు ఉండేవారు. అది రెండై చివరికి ఒకటై పోతుందేమో అని అందరూ భావిస్తున్న తరుణంలో రాజగోపాలరెడ్డి పేరు వెలుగులోకి వచ్చింది. జగన్ గాలి ఉంటే రాజగోపాలరెడ్డయినా, గోలి శీనయినా గెలుస్తాడన్నది ఉదయగిరి ఓటర్ల ధీమా. కాబట్టి, రాజగోపాలరెడ్డి అభ్యర్థిత్వంపై పెద్దగా అభ్యంతరాలు రాలేదు. మొత్తానికి బాబాయ్, అబ్బాయిలిద్దరు బుధవారం ఒకేసారి సీఎంని కలవడం జిల్లా రాజకీయ వర్గాలలో చర్చగా మారింది.





కాంచీపురం సిల్క్స్ | అరణి | బనారస్ | పైథాని | ఉప్పాడ | పటోలా | ఇక్కత్ | బాంధని | సాఫ్ట్ సిల్క్ | డిజైనర్ ఫ్యాన్సీ | కాటన్
కుప్పడం | గద్వాల్ | ఖాదీ | కళంకారీ | టస్సార్ | కోరా | చందేరి | లెనిన్ | పావడాస్ | డిజైనర్ ధోతీస్ | పెరుమాళ్ వస్త్రం

నెల్లూరు: మాగుంట లేఅవుట్, మినీ బైపాస్ రోడ్, ఫోన్: 0861 2359666

వెబ్సైట్ కోసం స్కాన్ చేయండి

Please Visit: www.kanchivml.com | Follow Us on: /kanchivmlsilks


# ఉత్తరక్రియలు

మృధుస్వభావి, ఆదర్శజీవి, మా పెద్దదిక్కు

## బత్తిన హేమనాథరెడ్డి గారు

తేది. 19.10.2023 గురువారము స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

భార్య - **భారతి**

అన్నలు :
**బత్తిన తొలసిరామిరెడ్డి**
**బత్తిన కుమారస్వామిరెడ్డి**

కుమార్తెలు - అల్లుళ్ళు
**మోహిని - కొండా నిరంజన్‌రెడ్డి**
**ప్రవీణ - మూలంరెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి**
**బబిత - అవిలాల చిత్తరంజన్‌రెడ్డి**

మనవళ్ళు - మనుమరాళ్ళు
**కుమారి కొండా చైతన్యరెడ్డి, కొండా ఈశ్వర్,**
**మూలంరెడ్డి నిహార్, నందన్,**
**కుమారి అవిలాల సునయన, అవిలాల అభినవ్**



జననం : 06.07.1951 నిర్యాణం : 19.10.2023

**ఉత్తరక్రియలు:** వారి పెద్దకర్మ తేది. 02.11.2023 గురువారము ఉదయం 10.00 గంటలకు, నెం.24-3-713, ప్రశాంతినగర్(నెల్లూరు క్లబ్ వెనుక), దర్గామిట్ట, నెల్లూరులోని మా స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

లాయర్
అక్టోబర్ 27, 2023

# అంతరిక్షంలో అద్భుత యాత్రలకు ఇస్రో శ్రీకారం

ఆకాశానికి నిచ్చెన వేసేద్దాం.. గగనవిహారం చేసేద్దాం... అన్నట్లుగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు అంతరిక్షంలో అద్భుతయాత్రలకు శ్రీకారం చుడుతున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు భారత శాస్త్రవేత్తల పరిశోధనలను ఆసక్తిగా గమనిస్తున్నారు. అందరూ అలా చూస్తుండగనే ఇటీవలే చంద్రయాన్, ఆ తర్వాత సూర్య యాన్‌లు దిగ్విజయమై అంతరిక్ష విజ్ఞానంలో భారత్ అగ్ర దేశాలకు ధీటుగా రాణిస్తుండడం గర్వకారణం. చంద్రుడి మీదకి అడుగిడగలమా?..అక్కడేముంది?..అనే ప్రశ్నలు ఎంతోకాలం నుంచి మానవాళిని తొలుస్తూనే ఉన్నాయి. సృష్టి రహస్యాలు కాస్తంతైనా తెలుసుకోవాలంటే గ్రహాల శోధన ముఖ్యం. ఏ గ్రహంలో ఏముందో?.. ఎప్పటికి తెలుసు కోగలం?.. అది సాధ్యమా?.. అంటే, తప్పకుండా సాధ్యం చేసుకుందాం అంటున్నారు మన శాస్త్రవేత్తలు. ప్రపంచంలో ఏ దేశమూ వెళ్ళని చంద్రుని దక్షిణ ధ్రువం మీదకి చంద్రయాన్ మిషన్ వెళ్ళడం ప్రపంచంలోనే ఒక అద్భుతం. సూర్యయాన్ మిషన్‌ను కూడా నిర్దేశిత కక్ష్యలోకి పంపేందుకు చేసిన ప్రయత్నాలు విజయపథంలో ఉన్నాయి. కోటానుకోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన భూమిపైనే కాదు, ఈ అనంత విశ్వంలో మానవునికి అంతుచిక్కని విషయాలు కోట్లాదిగానే ఉన్నాయి. ముఖ్యంగా సృష్టికి సంబంధించి రహస్యాలను ఛేధించేందుకు అపారమైన ప్రజ్ఞాపాటవాలు ఉండాలి. అమేయమైన సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగాలి. ఎన్ని అవాంతరాలొచ్చినా లెక్కపెట్టకుండా కార్యసాధనలో విజయం సాధించాలి. ఈ అన్ని లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి కనుకనే ఇస్రో శాస్త్రవేత్తలు గతంలోకంటే ఉత్సాహంగా ప్రయోగాల మీద ప్రయోగాలు చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కేవలం కలగానే మిగిలిపోయిన అంతరిక్షయాత్రలను ఒకటొకటిగా చేపట్టి ఆ కలలను సాకారం చేస్తున్నారు. ఎంతటి పెద్ద ప్రయాణమైనా.. చిన్నగా తొలి అడుగు పడాలి. ఇప్పుడు అలాంటి ప్రయత్నంలో ఇస్రో శాస్త్రవేత్తలు అడుగు ముందుకు వేస్తున్నారు. అంతరిక్ష విజ్ఞానంలో రాకెట్ వేగంతో దూసుకుపోతున్నారు. అంతే కాదు, తొలి మలి ప్రయోగాల్లోనే ఊహించని విజయాలు కూడా సాధిస్తున్నారు. చంద్రయాన్-సూర్యయాన్-తాజాగా గగన్‌యాన్‌కు కూడా సిద్ధమయ్యారు. అందులోనూ గగన్ యాన్ యాత్ర సామాన్యమైనదేమీ కాదు, ఎంతో క్లిష్టమైనది. మానవసహిత అంతరిక్ష యాత్రల ద్వారా మానవులను అంతరిక్షంలోకి పంపి, తిరిగి సురక్షితంగా భూమిమీదకు తీసుకువచ్చే అత్యంత సాహసోపేతమైన ప్రక్రియ ఇది. గగన్‌యాన్ ముందస్తు పరీక్షలో కూడా మన శాస్త్రవేత్తలు విజయం సాధించడం విశేషం. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ ప్రయోగానికి ఎన్నో ఏళ్ల నుంచి మన శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. గగన్‌యాన్ ద్వారా ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపాలని, తిరిగి వారిని సురక్షితంగా భూమి మీదకు తీసుకురావాలన్నది ఈ ప్రయోగం లక్ష్యం. బహుశా మరో రెండేళ్ళలోనే పూర్తిస్థాయి గగన్‌యాన్ ప్రయోగం జరగవచ్చని భావిస్తున్నారు. మానవ సహిత అంతరిక్ష యాత్రలో భాగంగా వ్యోమగాములు ఉండేందుకు అవసర మైన క్రూ మాడ్యూల్ వ్యవస్థను కూడా అద్వితీయమైన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించుకుని శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి తొలిసారిగా ప్రయోగాత్మకంగా, మానవ రహితంగా టెస్ట్ వెహికల్ టీవీ-డి1ను దిగ్విజయంగా ప్రయోగించారు. గగన్‌యాన్‌కు ముందు ఇస్రో నిర్వహించా లనుకుంటున్న పరీక్షల్లో ఇదే మొదటిది కావడంతో, గగన్ యాన్‌కు తొలి అడుగులు పడినట్లే. అయితే, ఇలాంటి పరీక్షలు గగన్‌యాన్‌కు ముందస్తుగా బోలెడన్ని జరగాల్సి ఉంది కూడా. అమెరికా, రష్యా, చైనా వంటి అగ్రరాజ్యాలకు ధీటుగా మన భారత శాస్త్రవేత్తలు స్వదేశీ పరిజ్ఞానంతో ఇటీవలికాలంలో అంతరిక్షరంగంలో అద్భుతాలు సృష్టిస్తు న్నారు. మిగతా దేశాలతో పోలిస్తే అత్యంత తక్కువ ఖర్చు తోనే ఈ ప్రయోగాలను విజయవంతంగా నిర్వహిస్తుండడం మరో విశేషం. 2035 నాటికి భారత్ ప్రత్యేకంగా అంతరిక్ష కేంద్రం ఏర్పాటుచేసు కోవాలని, 2040 నాటికి భారతీయుడు చంద్రునిపై దిగేలా చేయాలని ప్రధాని మోడీ ఇటీవలే లక్ష్యాన్ని నిర్దేశించారు కూడా. ఇస్రో ఛైర్మెన్ డా.సోమనాథ్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు ఆ లక్ష్యాల సాధనలో నిరంతరం అలుపెరగ కుండా కృషిచేస్తున్నారు. అంతరిక్షంలో భారత్ కీర్తిపతాక రెపరెపలాడేలా మరిన్ని పరిశోధనలకు సమాయత్తమవుతు న్నారు. దీంతో భవిష్యత్తులో గగన్‌యాన్ యాత్ర సాకారం అవుతుందనడంలో ఎలాంటి అనుమానం అక్కరలేదు.

# ఛీ!.. వీళ్ళు మనుషులేనా?




మేకలు, గొర్రెలు తదితర మూగ జీవాలు తాగే నీళ్ళల్లో విషం కలిపి వాటి చావును కళ్ళజూస్తున్నవాళ్ళను ఏమనాలి?.. వీళ్ళను మనుషులు కాదు పశువులని పిలిచినా ఆ పశుజాతికే తలవంపులు. వెంకటాచలం మండలంలోని కసుమూరు తదితర ప్రాంతాల వద్ద వున్న అడవుల్లో ఇలాంటి అకృత్యాలు ఇటీవలి కాలంలో ఎక్కువైపోతున్నాయి. పల్లెల్లో ఉండే మేకలు మేత కోసం అడవులకు వస్తుంటాయి. దాహం తీర్చుకునేందుకు అడవుల్లో ఉన్న నీళ్ళ గుంటల వద్దకు రావడం వాటికి అలవాటు. ఇదే అదనుగా, గుర్తుతెలియని వ్యక్తులెవరో అడవుల్లో సంచరిస్తూ ఆ గుంటల్లో విషం కలిపేస్తున్నారు. ఆ విషపు నీళ్లు తాగి ఆ మూగజీవాలు నెత్తురు కక్కుకుంటూ చనిపోతున్నాయి. ఇంత పాపపు పని మరెక్కడైనా ఉందా?..ఇంకొన్నిచోట్ల కరెంటు వైర్లు పెట్టి వన్యప్రాణుల్ని చంపేస్తున్నారు. ఉదయగిరి అడవుల్లో ఇనుప ఉచ్చులు బిగించి గోవుల ప్రాణాలు తీసి వాటి కళేబరాలను అమ్ముకు తింటున్నారు.

అక్రమార్కులు బరితెగించిపోతున్నా, అడవుల్లో ఇంత కర్కశపనులు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అటవీ శాఖ అధికారులు నిఘాపెట్టి, ఇంత అమానుషాలకు పాల్పడే దుండగులెవరో కనిపెట్టి, వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలి. అడవుల దారుల్లో అన్నిచోట్లా నిఘా కెమెరాలను ఏర్పాటుచేసి, వన్య ప్రాణుల రక్షణకు అన్నివిధాల చర్యలు చేపట్టాలి. జిల్లా పోలీసులు, అటవీ అధికారులు ఇకనైనా మేల్కొని ఈ దుష్కృత్యాలను నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

కేసీ పరశురామ్, వెంకటాచలం.


## చిల్డ్రన్స్ పార్కు పరమ అధ్వాన్నంగా తయారైంది

నెల్లూరులో చిల్డ్రన్స్ పార్కు నగరప్రజలకు పూలచెట్లతో, ఆటవస్తువులతో ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతుండేది. కాసేపు హాయిగా గడపాలంటే నగరవాతావరణంలో కాస్తంత మంచిచోటు దొరకడం గగనంగా ఉన్న ఈరోజుల్లో పిల్లాపాపలతో కలసి కుటుంబాలతో సహా వచ్చి గడిపేందుకు ఈ పార్కు అందరికీ ఉపయోగంగా ఉండేది. ఇప్పుడు ఆ పార్కు కూడా పరమ అధ్వాన్నంగా తయారవుతోంది. సుమారు రెండు దశాబ్దాల క్రితం ప్రముఖ దాత జెఎస్‌రెడ్డి దాతృత్వంతో ఈ పార్కు తొలినాళ్ళలో భలే బాగుండేది. చిల్డ్రన్ పార్కు అంటే మంచిపేరుండేది. అయితే, కాలక్రమేణా అది కూడా చెత్తకుప్పలా తయారైంది. పర్యవేక్షించే వారు కరువవడంతో పార్కు పరిస్థితి దయనీయంగా తయారైంది. వాకింగ్ ట్రాక్స్, వాటర్ ఫౌంటెన్స్ అన్నీ పగిలిపోయి మరమ్మతులకు గురైవున్నాయి. లైట్లు కూడా సక్రమంగా వెలగడం లేదు. పిల్లలకు ఆటవస్తువులు ఇచ్చే వారు లేరు.. ఆదుకునేవారూ లేరు. నగరపాలక సంస్థ వారు గట్టిగా పట్టించుకుని దాని బాగుకు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రార్థన.

– ఎం. నాగరాజు, నెల్లూరు.




# అవును... నిజమే గెలవాలి..!



"సత్యమేవ జయతే" ఇది ఇప్పటి మాట కాదు, అనాదిగా వినిపిస్తున్న మాట. ఎప్పుడైనా సత్యమే గెలుస్తుంది. ఒక్కోసారి అబద్ధం కూడా నెగ్గుతుంది. కానీ, అది నిజం బట్టబయలు అయ్యే వరకే. స్కిల్ స్కామ్ కేసులో నారాబాబు కారాగారానికి వెళ్లి ఇప్పటికే యాభై రోజులు గడిచింది. వాయిదాల ప్రకారం నవంబర్ 9న మళ్ళీ ఆయన పిటిషన్లని కోర్టులు పరిశీలిస్తాయి. అంటే అప్పటికి ఆయన లోపలికివెళ్లి రెండు నెలలు పూర్తవుతుంది. ఆ తరువాత కూడా కోర్టుల నిర్ణయాలు ఎలా ఉంటాయో ఊహాతీతం.

ఇప్పుడు చర్చల్లా... నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్రపైనే. ఆమె ఏ నిజం గెలవాలని యాత్ర చేపట్టారో ముందు తెలుగు ప్రజలకి స్పష్టత ఇవ్వాలి. నందమూరి భువనేశ్వరి నారా భువనేశ్వరిగా మారిన తరువాత జరిగిన చాలా సంఘటనలలో అనేక కఠిన నిజాలు ఉన్నాయి. ఆ నిజాలన్నీ నిజంగా నిజాలైతే బాబు బయట ఉండాలా...? జైల్లో ఉండాలా...?? అన్నది భువనేశ్వరే తేల్చాలి.

తొలిదశలో...

- చంద్రబాబు యువజన కాంగ్రెస్ నాయకుడిగా ఉన్న రోజుల్లో, డాక్టర్ రాజశేఖరరెడ్డి బ్రీఫ్ కేసు మోసింది... నిజమా... కాదా..?
- ఆ తరువాతి కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి అంజయ్యని ఒప్పించి బాబుకి మంత్రివర్గంలో రాజశేఖరరెడ్డి చోటు కల్పించిన విషయం నిజమా.. కాదా...?
- అదే రాజశేఖరరెడ్డిపై ఫ్యాక్షనిస్టు అంటూ ముద్ర వేసి ఆయనని నారా బాబు అసెంబ్లీ వేదికగా విమర్శించింది నిజమా.. కాదా..?
- నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టిన తొలిరోజుల్లో తన అల్లుడైన చంద్రబాబుని పార్టీలోకి ఆహ్వానించింది నిజమా... కాదా..?
- మామ పిలుపుని స్వీకరించి పార్టీలోకి రాకపోగా "అవసరమైతే మామపై పోటీకైనా నేను సిద్ధం" అని బాబు ప్రకటించింది నిజమా... కాదా..?
- కాంగ్రెస్ పార్టీ ఓడిపోయి, మామ అధికారంలోకి రాగానే మంత్రి పదవి కూడా ఇచ్చిన కాంగ్రెస్‌కి చెయ్యిచ్చి, బాబు మామ పార్టీలోకి దూరింది నిజమా.. కాదా..?
- పార్టీలో అడుగుపెట్టిన నాటి నుండీ అంతకుముందు నుండే పార్టీలో ఉన్న తన తోడల్లుడు దగ్గుపాటి ప్రాముఖ్యతను తగ్గించేలా బాబు పావులు కదిపింది నిజమా.. కాదా..?
- 1995లో లక్ష్మీపార్వతిని బూచిగా చూపించి మామ నుండి పార్టీని లాక్కొంది నిజమా... కాదా..?
- వైస్రాయ్ హోటల్ ముందున్న మామని అధికార బలంతో అడ్డుకుని కార్యకర్తల చేత చెప్పులు వేయించిన మాట నిజమా... కాదా...?
- పిల్లనిచ్చిన మామ కన్నుమూస్తే, బావమరిది హరికృష్ణ వచ్చేవరకు ఆయన భౌతికకాయం వద్దకు వెళ్లడానికి కూడా బాబు ధైర్యం చేయలేకపోయిన విషయం నిజమా... కాదా..?
- సత్తా ఉన్న నాయకుడిగా నేడు దేశాన్ని పరిపాలిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీని దేశద్రోహిగా ప్రకటించాలని బాబు డిమాండ్ చేసింది నిజమా... కాదా..?
- తన అపాయింట్‌మెంట్ కోసం అప్పట్లో మోడీ ఆంధ్రా భవన్‌కి వస్తే గంటల తరబడి బాబు నిరీక్షింపజేసింది నిజమా... కాదా..?
- పచ్చని రాష్ట్రం విడిపోవడానికి బాబు మద్దత్తు పలికింది నిజమా... కాదా...?
- అనాదాంధ్రగా రాష్ట్రం ఏర్పడిన తరువాత తన సామాజికవర్గం చేతిలో కీలు బొమ్మగా మారి అమరావతిని రాజధానిగా ప్రకటించింది నిజమా... కాదా...?
- రాజధాని అభివృద్ధి పేరుతో లక్షల కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులను తెచ్చి తాత్కాలిక కట్టడాలతో ప్రజలని మాయచేసింది నిజమా.. కాదా..?
- నిధులు రాబట్టుకునే క్రమంలో కేంద్రంలోని కమలదళానికి గులాముగా మారి ప్రత్యేకహోదాకి బాబు తిలోదకాలు ఇచ్చిన విషయం నిజమా.. కాదా...?
- చివరిగా రెండెకరాల ఆసామి ఈనాడు 2 లక్షల కోట్లకి అధిపతిగా మారడానికి రాజకీయాలే కారణమన్నది నిజమా.. కాదా..?

ఇలా చెప్పుకుంటూపోతే బాబు చేసిన భాగోతాలు చాలానే బయటకి వస్తాయి. స్కిల్ స్కాములో బాబుని బయటకి ఎలా తేవాలా..? అన్న విషయం పక్కనపెట్టి 'నిజం గెలవాలి' అంటూ బాబు సతి యాత్ర చేయడం విడ్డూరంగా ఉంది.

నిజంగా, నిజమే గెలిస్తే పైన పేర్కొన్నవన్నీ అబద్ధాలైపోతాయి. అలా కాకుండా, పైవన్నీ నిజాలైతే బాబు ఎక్కడుండాలో భువనేశ్వరే చెప్పాలి.

రాజకీయాలలో ఎప్పుడూ నిజం గెలవదు. భువనేశ్వరిలా ప్రతి రాజకీయవేత్త భార్యా నిజమే గెలవాలని ఉద్యమాలు చేస్తే.. మొత్తం రాజకీయ నాయకులంతా జైళ్లలోనే ఉండాల్సొస్తుంది..!

- రాజశ్రీ

# ముగ్గురు నెల్లూరీయులకు.. వైఎస్సార్ పురస్కారాలు

రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడోఏట ప్రకటించిన వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలకు, సాఫల్య పురస్కారాలకు నెల్లూరుజిల్లాకు చెందిన ముగ్గురు ప్రతిభావంతులు ఎంపికయ్యారు. ప్రముఖ సినీ నేపథ్యగాయని రావు బాలసరస్వతి, ప్రముఖ కవయిత్రి మహెజబీన్, ప్రముఖ కథా రచయిత ఖదీర్‌బాబు నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకోనున్నారు.

## • సంగీత సాహిత్యరంగాల్లో అవార్డులు

## లలిత సంగీతంలో మేటి.. రావు బాలసరస్వతి



జీవిత సాఫల్య పురస్కారాలు అందుకుంటున్నవారిలో తొలితరం ప్రముఖ నేపథ్య గాయని రావు బాలసరస్వతి ఒకరు. వెంకటగిరి రాజా కుటుంబానికి చెందిన రావు బాలసరస్వతి లలిత సంగీతంలో మేటి. ఆకాశవాణి సంగీత కార్యక్రమాల్లో ఆమె కంఠం సుపరిచితం. సినిమాలలో నేపథ్య గాయనిగా ఆమె గాత్రమాధుర్యం అందరినీ అలరించేది. 1940ల నాటికే ఆమె సంగీతంలో ప్రావీణ్యం సంపాదించింది. చిన్నతనంలోనే 'సతీ అనసూయ ధ్రువ విజయం' అనే చిన్నపిల్లల చిత్రంలో పాడడం, నటించడం ద్వారా ఆమె సినీరంగప్రవేశం చేసింది. 1937లో బాలయోగిని తమిళచిత్రంలో ప్రముఖ పాత్ర పోషించింది. గూడవల్లి రామబ్రహ్మం రూపొందించిన 'ఇల్లాలు' సినిమాలోనూ నటించి మంచి పేరు తెచ్చుకున్నారామె. 1944లో మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో, 1948లో విజయవాడ ఆకాశవాణి కేంద్రంలోనూ ఆమె లలిత సంగీత కార్యక్రమాలు సుప్రసిద్ధం. ప్రసిద్ధ సంగీతదర్శకులు సాలూరు రాజేశ్వరరావుతో కలసి ఆరోజుల్లో ఎన్నో లలిత గీతాలను ఆలపించి అందరి అభినందనలు అందుకున్నారు. సంగీతరంగలో ఆమె విశిష్ట కృషికి గుర్తింపుగా ప్రభుత్వం వైఎస్సార్ జీవితసాఫల్య పురస్కారం ప్రకటించడం విశేషం..సంగీతరంగానికే గర్వకారణం.

## కవిత్వంలో దిట్ట.. మహెజబీన్



ప్రముఖ కవయిత్రి మహెజబీన్ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉన్నా, ఆమె స్వస్థలం నెల్లూరే. 1961లో ఆమె నెల్లూరులో పుట్టింది. తల్లి నాహెద్ పర్వీన్ మొఘల్ రాజవంశీయురాలు. తండ్రి ఇస్మాయిల్ జర్నలిస్టు. నెల్లూరు కోర్టులో ఆయన న్యాయవాదిగా పనిచేశారు. మహెజబీన్ ప్రాథమిక విద్య అంతా నెల్లూరులోనే. బార్కాసు బడిలో ఓనమాలు దిద్దుకుని, డికెడబ్ల్యు కాలేజీలో డిగ్రీ చదువుకుంది. ఆ తర్వాత తిరుపతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ సోషల్‌వర్క్, అనంతరం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలో ఎల్‌ఎల్‌బి పూర్తిచేసి, సెంట్రల్ యూనివర్శిటీలో హ్యూమన్‌రైట్స్‌లో పీజీ డిప్లొమా చేయడం ఉన్నతవిద్యల పట్ల ఆమెకు ఉన్న ఆసక్తికి నిదర్శనం. అంతేకాదు, జర్మనీకి వెళ్లి ఫెమినిజం కోర్సును అధ్యయనం చేశారామె. ప్రస్తుతం హైదరాబాద్‌లో మానవహక్కుల న్యాయవాదిగా పనిచేస్తూ, ఎంతోమంది స్త్రీలకు న్యాయసహాయం అందజేస్తున్నారు. చిన్ననాటినుంచి కవిత్వంపై ఆసక్తితో మహెజబీన్ ఎన్నో కవితలు రాశారు. 1997లో 'ఆకురాలు కాలం' అనే కవితా సంపుటిని వెలువరించారు. ఇందులో ఉన్న 'స్ట్రీట్ చిల్డ్రన్' అనే కవిత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 10వ తరగతి విద్యార్థులకు తెలుగువాచకంలో ఒక పాఠ్యాంశంగా కూడా ఉండేది. ఆమె సాహితీసేవకు, సామాజిక సేవలకు ఎన్నో అవార్డులు లభించాయి. ఆంధ్రప్రదేశ్ యువజనశాఖ నుంచి 1997లో యువ పురస్కారం, 2007లో రాజీవ్‌గాంధీ మానవసేవ జాతీయ పురస్కారం, 2008లో భారత ప్రభుత్వం నుంచి జాతీయస్థాయిలో స్త్రీశక్తి పురస్కారం, 2014లో కెనడా నుండి శాంతి పురస్కారం వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులను ఆమె అందుకుని నెల్లూరు కవితాశక్తిని దశదిశలా చాటుతున్నారు. తెలుగు భాష-సాహిత్యాలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆమె వైఎస్సార్ సాఫల్య పురస్కారం అందుకోనుండడం సాహిత్యాభిమానుల్లో సంతోషం కలిగిస్తోంది.

## కథలపిట్ట ఖదీర్‌బాబు



నెల్లూరుజిల్లా కావలికి చెందిన ప్రముఖ కథారచయిత ఖదీర్‌బాబుది కొత్తతరం కథకులలో ప్రత్యేకస్థానం. వృత్తిరీత్యా సీనియర్ జర్నలిస్టుగా ఆయన హైదరాబాద్‌లో పని చేస్తున్నారు. తొలినుంచి ఆయనకు కథలంటే ఇష్టం. 1995లో ఆయన పుష్పగుచ్ఛం అనే కథ రాశారు. ఆ తర్వాత 1999లో రాసిన 'దర్గామిట్ట కతలు', 2004లో రచించిన 'పోలేరమ్మ బండ కతలు', పప్పుజాన్ కతలు, న్యూ బాంబే టైలర్స్, బియాండ్ కాఫీ, మెట్రోకథలు వంటి కథాసంపుటాలు ఆయనకెంతో పేరు తెచ్చాయి. చిన్నచిన్న కథలు, ఆకట్టుకునే వర్ణచిత్రాలతో ఆయన వెలువరించిన కథల పుస్తకాలు చిన్నారులనే కాక, పెద్దలను సైతం బాగా ఆకట్టుకున్నాయి. ఆయన కథలకు యు.కెకి చెందిన ప్రతిష్టాత్మకమైన 'చార్లెస్ వాల్లెస్ ఫెలోషిప్'కు ఎంపిక కావడం ఆయన కథా కథన దక్షతకు ప్రతీక. కథారంగంలోనే కాక, సినీరంగంలోనూ ఆయన 'మాటలు' అందరికీ సుపరిచితమే. ఆయనకు ప్రసిద్ధ కథకుడు మధురాంతకం రాజారాం స్మారకంగా ప్రదానం చేసే 'కథా కోకిల' అవార్డును బహుకరించారు. తెలుగు భాష-సాహిత్య రంగాల్లో విశిష్ట కృషిచేస్తున్న ఖదీర్‌బాబుకు వైఎస్సార్ సాఫల్య పురస్కారం లభించడం కావలికీ, నెల్లూరు జిల్లాకే కాక.. తెలుగు కథారంగానికే గర్వకారణం.




నిర్యాణం : 21.10.2023

శ్రద్ధాంజలి

మంచిని కాంక్షించే తత్వానికి
మానవీయ మనస్తత్వానికి
నిలువెత్తు రూపం
స్నేహశీలి, ప్రతిభాశాలి
మాజీ శాసనసభ్యులు
**శ్రీ జె.కె.రెడ్డి గారి**
సహధర్మచారిణి
**శ్రీమతి జక్కా సులోచనమ్మ గారి**
స్మృతికి చింతిస్తూ..
జక్కా కుటుంబసభ్యులకు
మనోస్థైర్యాన్ని ప్రసాదించవలసిందిగా
భగవంతుని ప్రార్థిస్తున్నాం...

**కే.వీ.రత్నం**
**శ్రీమతి పద్మావతి రత్నం**
వ్యవస్థాపకులు, రత్నం విద్యాసంస్థలు

# నెల్లూరు కబుర్లు

## సందడిగా ఆదాల పుట్టినరోజు పండుగ



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, నెల్లూరు రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఈనెల 25న ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 20వ డివిజన్ నుండి అభిమానులు, ముఖ్య నాయకులు 150 మంది పాల్గొని ఆదాల నివాసంలో కేక్ కట్‌చేసి ఆదాలకు శాలువాలతో, పుష్పగుచ్చాలతో ఆత్మీయంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నగరంలోని వాత్సల్య స్కూల్ అనాథ శరణాలయంలో 20వ డివిజన్ తరపున ఆదాలకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆదాల పెద్ద అల్లుడు పెళ్లకూరు చంద్ర కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పుట్టినరోజు కేక్ కట్ చేయించి 250 మంది అనాథ పిల్లలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ ఇన్‌ఛార్జిలు రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), తాళ్లూరి సురేష్ బాబు, డివిజన్ ముఖ్య నాయకులు దువ్వూరు భాస్కర్‌రెడ్డి, నగేష్ రెడ్డి, చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, వాకాటి వెంకట రామిరెడ్డి, రవీంద్రరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాబా మహాసమాధి ఉత్సవాలు



నెల్లూరు ట్రంకురోడ్డు వద్ద గాంధీనగర్‌లో కొలువై ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఈనెల 24న బాబా మహాసమాధి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సాయినాథునికి ప్రత్యేక అలంకారాలు చేశారు. అనంతరం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, సహస్ర నామ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయినాథుని దర్శించుకున్నారు. మందిరం ఛైర్మెన్ మన్నెం అమరనాథరెడ్డి, సభ్యులు కొల్లు అబ్బాయిరెడ్డి, దువ్వూరు జయమ్మ తదితరులు పర్యవేక్షించారు.

## హరిద్వార్ యోగా సదస్సుకు.. జేకే స్వప్న



అంతర్జాతీయ యోగా సదస్సుకు మన నెల్లూరీయురాలు జేకే స్వప్నకు ఆహ్వానం అందింది. ఇండియన్ యోగా అసోసియేషన్, దేవ సంస్కృత యోగా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు 17 నుంచి 19వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ యోగా సదస్సులో ఆమె పాల్గొననున్నారు. 'నేటి జీవన శైలి-యోగా నియమాల ఆవశ్యకత' అనే అంశంపై ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరిగే వర్క్‌షాప్‌లో ఆమెను పాల్గొనవలసిందిగా ఆ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఆనందీ బాలయోగి ఆహ్వానం పంపారు.

### ప్రైవేటు బస్సులపై..

## రవాణా అధికారుల దాడులు



ప్రైవేటు బస్సులపై నెల్లూరు రవాణాశాఖ అధికారులు ఈనెల 2న ఆకస్మిక దాడులు చేసి ప్రయాణీకుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న 8 బస్సులపై కేసులు పెట్టారు. అదే విధంగా, మద్యం తాగి డ్రైవర్లు బస్సులను నడుపుతుండడాన్ని గమనించి మరో 6 బస్సులను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, ప్రైవేటు బస్సుల్లో సరకు రవాణా చేస్తున్న ఇంకో 6 బస్సులను కూడా గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ బాలమురళీకృష్ణ, సహాయ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## షాపుల్లో చోరీలు

నెల్లూరు నగరంలో చోరీలు పెరిగిపోతున్నాయి. తాళాలు వేసి ఉన్న షాపులను కూడా దొంగలు వదిలిపెట్టడం లేదు. స్థాని జనార్దన్‌రెడ్డి కాలనీలో ఆదివారం రాత్రి ఓ పాన్‌షాప్‌లో దొంగతనం జరిగింది. షాప్ పైన ఉన్న రేకులు పగలగొట్టి మరీ దొంగలు ఈ చోరీకి పాల్పడ్డారు. షాప్‌లో ఉన్న సుమారు 10వేల రూపాయలు విలువచేసే సిగరెట్లు, కిళ్ళీ సామగ్రితో పాటు 12వేల రూపాయలను కూడా దోచుకుపోయారంటూ షాపు యజమాని అన్సర్ నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఆ ప్రాంతంలోనే ఓ ఎలక్ట్రికల్ షాపు, మరో చిల్లరదుకాణంలో కూడా చోరీలు జరిగాయని అంటున్నారు. పోలీసులు నిఘా పెట్టి దొంగల ఆటకట్టించాలని ప్రజలు కోరుతున్నారు.



### శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న..

## హైకోర్టు న్యాయమూర్తి

శ్రీ దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని ఈనెల 24న రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ శేషసాయి కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రత్నం జయరామ్, ఇఓ అరవభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు వారిని ఆలయ మర్యాదలతో సాదరంగా స్వాగతించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, ప్రోటోకాల్ జడ్జి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## షిర్డీసాయికి నక్షత్ర హారతులు



నెల్లూరులోని పద్మావతి నగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో షిర్డీ సాయి ఆరాధన మహోత్సవాలు సోమవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. సాయిబాబా 105వ మహాసమాధి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ స్వామివారిని శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేస్తున్నారు. 'ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి' అంటూ భక్తులు సాయి నామోచ్ఛారణలతో మందిరంలో ప్రదక్షిణలు చేసి సాయిబాబాను దర్శించుకున్నారు. మందిరం కమిటీ ఛైర్మెన్ మధుసాయి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం రోజున 306 జ్యోతులను వెలిగించి సాయినాథునికి భక్తిశ్రద్ధలతో నక్షత్ర హారతులిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మందిరం గౌరవసలహాదారు పాబోలు సుబ్బరామయ్య,ర కమిటీ సభ్యులు బాబీసాయి, సాయి భక్తమండలి సభ్యులు పర్యవేక్షించారు.

## 'తంగిరాల మహాభారతం' 78వ భాగం

అవమానభారంతో, దుఃఖంతో విలపిస్తున్న ద్రౌపదీదేవిని చూసి నూరుమంది కౌరవ కుమారులలో ఒకడైన వికర్ణుడు లేచి నిలబడి ద్రౌపదీ దుర్యోధనుని దాస్యురాలు కాదని, ఆమెని అలా పరాభవించిన పర్యవసానం ఘోర నరక రూపంగా పరిణమిస్తుందని హెచ్చరిస్తాడు. కర్ణుడు, వికర్ణుని మాటలకు అడ్డొచ్చి, ద్రౌపదిని కులట అని నానా విధాల దూషిస్తాడు. దుర్యోధనుడు దుశ్శాసనునితో ద్రౌపది మరియు పాండవుల బట్టలూడదీయమని ఆదేశిస్తాడు.




దుశ్శాసనుడు ద్రౌపది దగ్గరకు వచ్చి చీర లాగుతుంటే... ద్రౌపది శ్రీకృష్ణుని దీనంగా వేడుకుంటుంది. అప్పటినుంచి దుశ్శాసనుడు ఎంతసేపు లాగినా చీరలు వస్తూనే ఉంటాయి. ఇదంతా కోపంతో చూస్తున్న భీమసేనుడు, భరించలేక దుశ్శాసనుణ్ణి లోకమంతా భయపడేట్లు చంపి అతని గుండెలు చీల్చి రక్తం త్రాగుతానని శపథం చేస్తాడు. విదురుడు సభా సదులను ద్రౌపది అడిగిన ప్రశ్నకు నిష్పక్ష బుద్ధితో సమాధానం చెప్పమని కోరుతాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## వృద్ధులకు కొండ్రెడ్డి రోహన్‌రెడ్డి అన్నదానం



విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని నెల్లూరు నగరంలోని బాలాజీ నగర్ గీతామయి వృద్ధుల ఆశ్రమంలో నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆదాల మురళీకృష్ణరెడ్డిల మనవడు కొండ్రెడ్డి రోహన్‌రెడ్డి వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానం అనంతరం అవ్వతాతలను రోహన్ ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భగవంతుడు మీకు అన్ని విధాలుగా అండగా ఆశీర్వాదాలు అందించాలని ఈ సందర్భంగా వృద్ధులు రోహన్‌రెడ్డిని దీవించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు పాశం శ్రీనివాస్, వేలూరు శ్రీధర్‌రెడ్డి, యాకసిరి శరత్‌చంద్ర, పొట్లూరి జయవర్ధన్, యం. శ్రీకాంత్, శ్రీనివాసులురెడి, ఆశ్రమం నిర్వాహకులు పాండు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ల సంఘానికి ఎన్నికలు

ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పొదిలి చిన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నగరంలోని మద్రాసు బస్టాండు వద్ద ఉన్న ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘం నాయకులు కె.చిరంజీవి, ఆలపాటి సుధాకర్, ఏపీ జేఏసి అమరావతి జిల్లా నాయకుడు శరత్‌బాబు, ఆర్అండ్‌బీ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకుడు బెల్లంకొండ మస్తానయ్య తదితరులు పాల్గొని చిన్నయ్యను అభినందించారు.





## ఆదాలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీలు

నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్), ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 25న నగరంలోని ఆదాల కార్యాలయంలో ఆయన్ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. నగర డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, విజయా డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖనిజ సంపదను దోచుకుతింటున్నారు

### వైకాపా నాయకులపై సోమిరెడ్డి ధ్వజం



జిల్లాలో ఖనిజ సంపదను వైకాపా నాయకులు అడ్డంగా దోచుకుతింటున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కొత్తగా రెండు భారీ కుంభకోణాలకు వైకాపా నాయకులు తెర లేపారని ఆయన విమర్శించారు. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర తదితరులతో కలసి ఈనెల 24న ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు వచ్చేలోగా వేల కోట్లు దోచుకోవాలని వైకాపా నేతలు చూస్తున్నారని, ఎంతో విలువైన క్వార్ట్జ ఖనిజానికి డిమాండ్ బాగా ఉండడంతో సైదాపురం, రాపూరు, వెంకటగిరి ప్రాంతాల్లో లభించే క్వార్ట్జ్‌పై వాళ్ళ కన్నుపడిందన్నారు. ఈ దోపిడీలో వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు వైసీపీ నేతలతో కలిసి పర్యటించేందుకు తాము సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. మైనింగ్ చట్టాలను కూడా పట్టించుకోకుండా, అందినకాడకి కాజేస్తున్నారన్నారు. వైసీపీ నేతల దోపిడీలో కొందరు అధికారులు కూడా భాగస్వాములైపోయారని ఆయన ఆరోపించారు. 100కి పైగా అక్రమంగా స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసి వేల టన్నుల క్వార్ట్జ్‌ను సరిహద్దులు దాటించేస్తున్నారని దుయ్యబట్టారు. ఇంత బరితెగించి దోచుకుంటూ టీడీపీ వారిపై నిందలు వేయడం సరికాదన్నారు. జిల్లాలో వైసీపీ నాయకులంతా కలిసి ఇంత బహిరంగంగా పకృతి సంపదను దోచేస్తుంటే మైనింగ్ శాఖ ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. నకిలీ డాక్యుమెంట్లు, ఫేక్ ఆధార్ కార్డులు పెట్టి వేల ఎకరాల రికార్డులు మార్చేస్తుంటే కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రేక్షకపాత్ర వహించడం బాధాకరమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తుందని, ఈ రెండు కుంభకోణాలను వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు.

## రాజరాజేశ్వరమ్మ హుండీ రాబడి..

## రూ. 30.59 లక్షలు



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజ రాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయానికి భక్తుల కానుకల ద్వారా రూ. 30.59 లక్షల రూపాయలు హుండీ రాబడి వచ్చింది. ఈనెల 25న ఆలయంలోని హుండీలను లెక్కించారు. సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 25వ తేదీవరకు 37 రోజుల్లో మొత్తం 30,16,718 రూపాయలు రాబడివచ్చినట్లు ఆలయ ఇఓ అర్వభూమి వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. అన్నదానం హుండీ ద్వారా42,491 రూపాయలు వచ్చాయన్నారు. బంగారం 40 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారం, 123 గ్రాముల వెండి హుండీ ద్వారా లభించిందని చెప్పారు. ఈ లెక్కింపులో దేవాదాయశాఖ అధికారి జె.శ్రీనివాసరావు, ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్ తదితరులు పాల్గొన్నారు.





## శ్రీసిటీకి వచ్చిన..

## జర్మనీ విశ్వవిద్యాలయ బృందం

జర్మనీలో ప్రముఖమైన గోట్టింగెన్ విశ్వవిద్యాలయానికి చెందిన 35 మంది అధ్యాపకులు, విద్యార్థుల ప్రతినిధి బృందం ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. ప్రొఫెసర్ సబాస్టిన్ నేతృత్వంలో సందర్శనకు విచ్చేసిన వారు స్థానిక బిజినెస్ సెంటర్‌లో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో సమావేశమయ్యారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో వేగంగా ముందుకు సాగుతున్న శ్రీసిటీ ప్రత్యేకతలను ఆయన వారికి వివరించారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ పారిశ్రామికవృద్ధిని సాధించడంపై తాము ప్రత్యేకదృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, దేశంలోని అత్యుత్తమ కార్బన్-న్యూట్రల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌లలో ఒకటిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. స్థానిక యువత ఉపాధి కల్పన కోసం చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి చర్యలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలు, ఆర్థికంగా వెనుకబడిన పరిసర ప్రాంతాలలో పై కార్యక్రమాలు ద్వారా ఎలాంటి మార్పులు తెచ్చాయన్న అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా విదేశీ విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లకు శ్రీసిటీ తగు సహకారం అందిస్తుందని చెప్పారు. అనంతరం ప్రతినిధి బృందం క్రియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. క్రియా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, ఐఎఫ్ఎంఆర్/క్రియా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షారన్ బ్యూటీయు, అధ్యాపకులు విద్యార్థులతో చర్చా కార్యక్రమంలో నిర్వహించారు. శ్రీసిటీ పరిధిలోని తొండూరు సొసైటీ గ్రామాన్ని సందర్శించి, గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల సిబ్బంది, పిల్లలతో, స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై చర్చించారు. చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, రోగులతో మాట్లాడారు.




నివాళి

మా ఆత్మబంధువు - ఆత్మీయసింధువు
మాజీ శాసనసభ్యులు
జె.కె.రెడ్డి గారి సతీమణి
శ్రీమతి జక్కా సులోచనమ్మ గారి
మృతికి చింతిస్తూ...
వారి ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.



- తుంగా కుటుంబం

# ధర్మప్రచారం కోసం.. మాస-పక్షోత్సవాలు



దేవాదాయ శాఖ సూచన మేరకు సనాతన హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయంగా నిర్వహిస్తున్న ధర్మప్రచారంలో భాగంగా త్వరలో జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన.. రాపూరు మండలం పెంచలకోనలో వెలసివున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో మాసోత్సవాలు, వారోత్సవాలను చేపట్టాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. హిందూ ధర్మాన్ని మరింతగా వ్యాపింపజేయడం కోసం, ఆలయ సంస్కృతిని ప్రజలందరికీ తెలపడం కోసం ధర్మ ప్రచారంలో భాగంగా ఈ మాసోత్సవాలను, వారోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఆమేరకు ఏపీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఇటీవల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధే ధ్యేయంగా.. సంక్షేమ పథకాలు

**- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ**

విద్యాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో వివిధ సంక్షేమపథకాలు అమలుచేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకుని రాణించాలని జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఆనం అరుణమ్మ ఆకాంక్షించారు. ఈనెల 21న నెల్లూరులోని జడ్పీ సమావేశమందిరంలో ఏర్పాటుచేసిన మండల విద్యాశాఖాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో అభివృద్ధిచేస్తూ, పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తూ ప్రభుత్వం విద్యార్థులకు చేయూతనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జొన్నవాడ కామాక్షమ్మకు
# ముత్యాలహారం బహుకరణ

జిల్లాలోని ప్రసిద్ధమైన బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి వైఎస్సార్ జిల్లా రైల్వే కోడూరుకు చెందిన తోట శివసాయి దంపతులు ఈనెల 23న సుమారు 10 లక్షల రూపాయల విలువ చేసే ముత్యాలహారం సమర్పించుకున్నారు. ఆలయ నిర్వాహకులు దాతలకు దైవ దర్శనం చేయించి సత్కరించారు.

# ధర్నాను విజయవంతం చేయండి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈనెల 29న విజయవాడలో ధర్నా జరుగుతుందని, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి కోరారు. ఈనెల 24న నెల్లూరులోని డిఇఓ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలన్నారు. నాయకులు రియాజ్, జుల్ఫికర్ ఆలీ, సీహెచ్ కృష్ణారెడ్డి, సుంకు వెంకటేశ్వర్లు, బి.కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# పేద రోగులకు అంకితభావంతో సేవలు

## డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్‌కు పదేళ్ళు

- 'స్ట్రోక్ యాప్'ను ప్రారంభించిన డాక్టర్ శ్రీరాం సతీష్




నరాల సంబంధిత వ్యాధులతో బాధపడుతూ, వైద్యం చేయించుకునేందుకు ఆర్థికస్తోమత లేని పేదల కోసం ఏర్పాటై విజయవంతంగా కొనసాగుతున్న డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్‌కు పదేళ్ళు పూర్తయ్యాయి. రోగుల సేవల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న ఈ సంస్థకు కెఎంఆర్ నంబియార్ ఛైర్మెన్‌గా, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ కార్యదర్శిగా 2013లో ఈ ఫౌండేషన్ ప్రారంభమైంది. నరాలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నవారికి వ్యాధి పట్ల అవగాహన పెంచడం, వారికి ఉచితంగా వైద్య సహాయం అందించడం ఫౌండేషన్ లక్ష్యంగా నేటికీ ముందుకు సాగుతోంది. ఈ సందర్భంగా భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా 'స్ట్రోక్ కనెక్ట్' పేరుతో ఒక ప్రత్యేక యాప్‌ను ప్రారంభించారు. ఈనెల 22న నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ప్రత్యేక యాప్ ద్వారా స్ట్రోక్ రోగులను దానికి అనుసంధానం చేసి, తద్వారా రోగులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయవచ్చన్నారు. ఈ యాప్ స్ట్రోక్ రోగుల వ్యాధి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వారికి సంకేతాలిస్తుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేదిగా ఉండి అందరి అభినందనలు అందుకుంది. డాక్టర్ బిందుమీనన్ నిబద్ధతతో ఈ ఫౌండేషన్ కార్యకలాపాలు ముమ్మరమవుతున్నాయి. 'న్యూరాలజీ ఆన్ వీల్స్' పేరుతో ఓ వాహనాన్ని మినీ హాస్పిటల్‌గా మార్చి అందులో వివిధ సౌకర్యాలు కల్పించారు డాక్టర్ బిందుమీనన్. ఆ వాహనం ద్వారా గ్రామీణ ప్రాంతాలను సందర్శించి పేద వర్గాలకు వైద్య సేవలు అందిస్తున్నారు. 'న్యూరాలజీ ఆన్ వీల్స్' ద్వారా ఇప్పటివరకూ 46 గ్రామాలను సందర్శించి 12వేల మందిని పరీక్షించడం జరిగిందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

---

## తిరుపతి జిల్లా
# గూడూరు డివిజన్

# మహాలక్ష్మమ్మ అమ్మవారి సేవలో పొణకా దంపతులు



గూడూరు పట్టణంలోని బొడ్డుచౌక్ వద్ద కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవాలు ఈ నెల 25వ తేదీ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన చండీ హోమం, కుంభాభిషేక పూజా కార్యక్రమాల్లో వైకాపా నేత పొణకా శివకుమార్‌రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ దంపతులు పాల్గొన్నారు. వీరికి ఆలయ మర్యాదలతో నిర్వాహకులు స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోనక దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కోదండ రామయ్య, సాయి, నిర్వాహకులు ముని, సురేష్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జన్మదినం సందర్భంగా ఈ నెల 22వ తేదీ పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న గూడూరులోని అలఘనాథస్వామి దేవస్థాన మాజీ ఛైర్మెన్ కంకణాల పెంచలనాయుడు తదితరులు.

# శిశు మందిరంలో సామూహిక అక్షరాభ్యాసాలు



గూడూరులోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో ఈ నెల 20వ తేదీ శ్రీశ్రీశ్రీ స్వామి ప్రణవాత్మానంద సరస్వతీ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గణపతి పూజ, హోమం నిర్వహించారు. అనంతరం స్వామీజీ అక్షరాభ్యాసం యొక్క విశిష్టతను తెలియజేసి, తల్లిదండ్రుల యొక్క బాధ్యతలను మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి దాతలుగా మల్లెమాల మురళీరెడ్డి, పయ్యావుల మురళీకృష్ణ, రావూరు రవిచంద్రారెడ్డి, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహాస్వామిలు వ్యవహరించగా, పాఠశాల ఉపాధ్యక్షులు ఆర్.వి.రావు, సహకార్యదర్శి ఎస్.ఎల్.వి.ప్రసాద్, కోశాధికారి రామ్మోహన్, మయూరి శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆలయంలో అన్నదానం

గూడూరు రెండో పట్టణ పరిధిలోని మాలవ్యనగర్‌లో వెలసి ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం చేపట్టిన భారీ అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి పట్టణ పురవీధుల్లో మహాలక్ష్మి అమ్మవారి జెండా ఉత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు సేకరించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులతో పాటు వైసీపీ నాయకులు వినీష్ యాదవ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



# వివిఎస్ఆర్‌లో ప్రభాస్ జన్మదిన వేడుకలు

గూడూరు పట్టణంలోని వివిఎస్ఆర్ స్కూల్‌లో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలు ఇటీవల ఘనంగా జరిగాయి. ప్రభాస్ యువసేన అధ్యక్షులు యోగి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ స్వయంగా వడ్డించారు. వై.యస్.ఆర్.సి.పి టౌన్ ట్రెజరర్ సూరిశెట్టి హరిక్రిష్ణ, తిరుపతి జిల్లా, డి.వి.ఎం.సి మెంబర్ వాకాటి ప్రభాకర్, గూడూరు రూరల్ ఎస్.ఐ ఎం.మనోజ్‌కుమార్, నాయకులు పడియాల శ్రీహరి, వి.యస్.ఆర్ స్కూల్ కరస్పాండెంట్ బాలరాజు, రెట్టపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు పలసరుకులు

గూడూరులోని డివిఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 22వ తేదీ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఓజిలి మండలం భట్లకనుపూరు గ్రామానికి చెందిన 'గున్నం చారిటబుల్ ట్రస్ట్' అధినేత గున్నం మధుసూదన్‌రెడ్డి దాతృత్వంతో వివిధ మండల శాఖల పరిధిలోని 20మంది నిరుపేదలకు పల సరుకులను పంపిణీ చేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి, బి. వెంకట కృష్ణారెడ్డి, చిరంజీవి రితిక, కేంద్ర నిర్వాహక సభ్యులు డి.ప్రజేందర్‌రెడ్డి, ఏ.భాస్కర్‌రెడ్డి, బి.దశరదరామిరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## మాడభూషి శేషాచార్యుల
# సేవలు చిరస్మరణీయం

దివంగత విద్యావేత్త..మాడభూషి శేషాచార్యుల వారి సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఈనెల 26వ తేది గురువారం నాడు అల్లూరులోని రామకృష్ణ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి ఆ మహనీయుని సేవలను తలచుకున్నారు. రామకృష్ణ విద్యాసంస్థల ఏర్పాటుకు కారకులు, ప్రేరకులు అయిన మాడభూషి శేషాచార్యుల వారి విగ్రహాన్ని ఆ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆవిష్కరించి స్ఫూర్తిదాయకమైన ఆయన సేవలకు సార్థకత కల్పించారు నిర్వాహకులు. రామకృష్ణ విద్యాసంస్థల యాజమాన్యం, శేషాచార్యుల కుటుంబసభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఇంతకాలం తర్వాతనైనా ఈ మంచి కార్యక్రమం జరగడం పట్ల గ్రామస్తుల్లో ఆనందం కలుగుతోంది. వేలాదిమందికి విద్యాభిక్ష పెట్టిన రామకృష్ణ విద్యాసంస్థల స్థాపనకు ప్రముఖ దాతలు అల్లంపాటి కుటుంబం వారు చేసిన కృషికి శేషాచార్యుల వారు అప్పట్లో మార్గదర్శకులుగా ఉండి, ఆ విద్యాలయం అభివృద్ధికి పునాదులు వేశారు. 1928లో ప్రారంభమైన ఆ విద్యాలయం నేడు మహోన్నతమైన విద్యాసంస్థగా ఎదిగింది. అందుకు కారణమైన దాతలు, విద్యావేత్తలను అందరినీ ఈ సందర్భంగా వక్తలు అభినందించారు. ఈ విగ్రహావిష్కరణలో మాడభూషి శేషాచార్యుల వారి మనుమడు మాడభూషి రాజగోపాలాచారి, కుటుంబసభ్యులు మాడభూషి విజయరాఘవన్, శ్రీనివాస్, మాధవన్, మాడభూషి శ్రీధర్, రామకృష్ణ విద్యాసంస్థల కరెస్పాండెంట్ అల్లంపాటి ఇందిర, కమిటీ ఉపాధ్యక్షులు మేడా రఘురామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ముప్వా గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కళాశాల పూర్వ అధ్యాపకుడు, అవధాని కోట రాజశేఖర్ పద్యరత్నాలు పఠించారు. ఈ సందర్భంగా రామకృష్ణ విద్యాసంస్థల విశ్రాంత అధ్యాపకులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

## ట్రాఫిక్ నిబంధనలపై..
# డీఎస్పీ క్లాస్




నెల్లూరులో ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ ఈనెల 25న క్లాస్ పీకారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకుంటే కేసులు తప్పవంటూ కౌన్సిలింగ్ నిర్వహించారు. నెల్లూరులోని కెవిఆర్ పెట్రోలు బంక్ వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్నవారిని లైనుగా నిలబెట్టి, ఇకనుంచీ తప్పకుండా నియమనిబంధనలు పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

## 'గాంధీ శాంతి పురస్కారం' కమిటీ సభ్యునిగా..
# మన వెంకయ్య



దేశంలో ప్రతిష్టాత్మకమైన జాతిపిత మహాత్మాగాంధీ శాంతి పురస్కారం ఎంపిక కమిటీకి కేంద్రప్రభుత్వం మాజీ ఉప రాష్ట్రపతి..మన నెల్లూరీయులైన ముప్పవరపు వెంకయ్యనాయుడును సభ్యునిగా నియమించింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఇటీవల ఆమేరకు ఉత్తర్వులిచ్చింది. ఈ పురస్కారాన్ని 1995లో ప్రారంభించారు. అవార్డు కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ స్పీకర్‌తో పాటు, ఏదైనా రంగంలో విశిష్ట కృషి చేసిన ఇద్దరు ప్రముఖులు కూడా సభ్యులుగా ఉంటారు. గాంధీజీ ప్రబోధించిన మార్గాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తన తీసుకురావడంలో కీలకపాత్ర పోషించే వ్యక్తులకు, సంస్థలకు ప్రతి ఏటా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. పురస్కార గ్రహీతలకు కోటి రూపాయల నగదుతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక ఫలకాన్ని అందజేస్తారు. ఇంతటి విశిష్టమైన గాంధీ శాంతి పురస్కార కమిటీలో సభ్యునిగా తనను నియమించినందుకు వెంకయ్యనాయుడు సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రధాని నరేంద్రమోడీకి ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీసిటీని సందర్శించిన జపాన్ వ్యాపార ప్రతినిధులు




ఒసాకాలోని జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) డైరెక్టర్ జనరల్ మురహషి యసుయుకి, ఒసాకా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఓసిసిఐ) ఇంటర్నేషనల్ బిజినెస్ కమిటీ ఛైర్మెన్ టొమిటా మినోరు ఆధ్వర్యంలో 23 మంది ప్రముఖ జపాన్ వ్యాపార ప్రతినిధుల బృందం ఇటీవల సిటీని సందర్శించింది. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ వీరికి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ అత్యున్నత స్థాయి మౌళిక సదుపాయాలు, వేగవంతమైన అభివృద్ధి మరియు శ్రీసిటీలో తయారీ యూనిట్లను నెలకొల్పడం వల్ల కలిగే వివిధ ప్రయోజనాల గురించి శ్రీసిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బోడ్గన్ జార్జ్ వివరించారు. జపాన్‌కు చెందిన ప్రముఖ వ్యాపార ప్రతినిధులు మరియు జెట్రో, ఓసిసిఐ ఉన్నతాధికారులు శ్రీసిటీ పర్యటనకు రావడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశంలో రెండవ అతిపెద్ద జపాన్ పరిశ్రమల కేంద్రమైన శ్రీసిటీలోని వ్యాపారానుకూల వాతావరణం, ప్రపంచశ్రేణి మౌళిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రభుత్వ సహకారం తప్పకుండా వీరిని విశేషంగా ఆకట్టుకుంటాయని, ఫలితంగా శ్రీసిటీలో జపాన్ పెట్టుబడులు మరింత పెరగడానికి ఉపకరిస్తుందని అన్నారు జపనీస్ భారీ పరిశ్రమలకు అవసరమైన సరఫరా గొలుసు సంస్థలు కూడా తమ పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేట్టు ప్రోత్సహించే అనువైన పర్యావరణ వ్యవస్థ శ్రీసిటీలో ఉందంటూ ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీ మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల వాతావరణం పట్ల టొమిటా మినోరు సంతృప్తిని వ్యక్తం చేశారు, శ్రీసిటీ వ్యాపార సామర్థ్యం, వేగవంతమైన అభివృద్ధి తమను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. మురహషి యసుయుకి మాట్లాడుతూ దేశంలోని అత్యుత్తమ పారిశ్రామిక పార్కులలో ఒకటిగా శ్రీసిటీని ప్రశంసించారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలను చుట్టిచూడడంతో పాటు కొబెల్కో కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను వారు సందర్శించారు, శ్రీసిటీలోని పలు జపనీస్ కంపెనీల సీఈఓలతో సమావేశమై చర్చించారు. జెట్రో చెన్నై డైరెక్టర్ షోటా హమసాకి, సీనియర్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ హిడెకి అసబా ఈ పర్యటనకు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

## శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో..
# వేడుకగా వార్షిక ఉత్సవాలు



శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ వార్షిక ఉత్సవాలు ఈనెల 21న అత్యంత వేడుకగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, శ్రీమద్భాగవత పారాయణంతో ఆలయ పరిసరాలు మారుమ్రోగాయి. పరిశ్రమల ఉద్యోగులు, ట్రిపుల్ ఐటీ, క్రియా యూనివర్సిటీ విద్యార్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సాహంగా ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులందరికీ స్వామివారి తీర్థం. అన్నప్రసాదాలు అందచేశారు. ముందురోజు సాయంత్రం వేదపండితుల సంకల్పం, కలశపూజ, పుణ్యాహవచనం, వేదపారాయణం కార్యక్రమాలతో వార్షిక ఉత్సవాలు మొదలయ్యాయి. శనివారం వేకువన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హోమం నిర్వహించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీవారి వార్షిక ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి ఆలయ ప్రాంగణంలో భాగవత సప్తాహం కొనసాగుతోంది. భక్తులు పెద్దఎత్తున పాల్గొని ఆలయ వార్షిక ఉత్సవాలను విజయవంతం చేయడం పట్ల డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. చుట్టు పక్కల గ్రామస్తులు కూడా ఆలయాన్ని సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

## టూకీగా...



### జొన్నవాడ దేవాలయంలో ఉచిత వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండలంలోని జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో ఇటీవల నారాయణ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి భక్తులకు బీపీ, షుగర్ తదితర ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులిచ్చారు. ఆలయ అధికారులు, నిర్వాహకుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

### వెల్లంటిలో కేంద్ర ఆరోగ్యబృందం పర్యటన

నెల్లూరు రూరల్‌లోని సౌత్‌మోపూరు పీహెచ్‌సి పరిధిలోని వెల్లంటి గ్రామంలో ఇటీవల కేంద్ర ఆరోగ్యబృందం పర్యటించి కేంద్రం అమలుచేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను వివరించింది. నోడల్ అధికారులు రాజయ్య, సుధాకర్‌రావు, సభ్యులు సుమలత, ప్రణీత, దీపిక, శామ్యూల్, వీరాస్వామి, పరమేష్, మమత, పీహెచ్‌సి వైద్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, కవిత పాల్గొన్నారు.

### ఆల్తుర్తిలో బిందుసేద్యంపై అవగాహన

పొదలకూరు మండలంలోని ఆల్తుర్తిలో ఇటీవల బిందు సేద్యం, తుంపర్ల సేద్యంపై ఏపి ఎంఐపీ పీడీ బి.శ్రీనివాసులు రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి చెట్టుకు పుష్కలంగా నీరందాలంటే ఈ సూక్ష్మసేద్యం విధానాలు ముఖ్యమన్నారు. అందుకు అవసరమైన పైపులను ప్రభుత్వం రాయితీతో ఇస్తుందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### వింజమూరులో బాధితుల ఆందోళన

వింజమూరు మండలం వెంకటాద్రిపాళెంలో ఉన్న తమ నివేశన స్థలం అన్యాక్రాంతమైపోయిందంటూ ఆ గ్రామానికి చెందిన బాధితులు పి. ఆలయ్య, రమణయ్య, ఆదయ్య, రమేష్, గోపాల్ తదితరులు ఇటీవల ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని అధికారులను కోరుతూ వింజమూరులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

### రేబాలలో కార్మికులకు అన్నవితరణ

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాలలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 24న మూడువందల మంది కార్మికులకు వైకాపా నేత చిరమన రమేష్ అన్నవితరణ చేసి, వారందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

### వావిలేరులో ట్రాన్స్‌ఫార్మ్‌లోని రాగి చోరీ

చేజర్ల మండలం వావిలేరు గ్రామంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు తమ పొలం వద్ద ఉన్న 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్‌ను అపహరించారని, దానిని పగలగొట్టి అందులో ఉన్న రాగితీగలను చోరీ చేశారని అక్కడున్న ఓ రైతు విద్యుత్ లైన్‌మెన్‌కు తెలియజేశాడు వెంటనే లైన్‌మెన్ మస్తానయ్య ఆ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు

### సోమశిల డ్యామ్‌ను పరిశీలించిన సమాచార కమిషనర్

రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ చిన్నారెడ్డి ఈనెల 24న జిల్లాలోని సోమశిల డ్యామ్‌ను సందర్శించారు. జలాశయాన్ని పరిశీలించి, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ రెవిన్యూ అధికారి ప్రభాకర్, ఏఎస్ఐ మస్తాన్‌బాషా పాల్గొన్నారు.

### పాలిచెర్లపాడులో 15 మేకలు దుర్మరణం

కసుమూరు వద్దనున్న అటవీప్రాంతంలో నీటిగుంటల్లో ఉన్న నీళ్ళు తాగి 15 మేకలు మృతిచెందడంతో, వాటి యజమాని.. ఎస్టీ కాలనీకి చెందిన తిరుమలశెట్టి జ్ఞానయ్య లబోదిబోమంటున్నాడు. అవి చనిపోవడంతో సుమారు రెండు లక్షల రూపాయల దాకా నష్టమని ఆయన కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఆ నీళ్ళల్లో ఎవరైనా విషపదార్థాలు కలిపివుంటారేమోనని గ్రామస్తుల అనుమానం.

### వానలు కురవాలంటూ కప్పలకు పూజలు

గ్రామీణప్రాంతాల్లో ఇంకా పాతకాలపు ఆచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. వానలు కురవాలంటూ ఉదయగిరిలో ఇటీవల కొంతమంది వరుణిడి కరుణ కోసం కప్పలకు పసుపు కుంకుమలు పూసి, పూజలుచేసి ఊరేగించారు. అలా చేస్తే వానలొస్తాయని, ఎంతోకాలం నుంచి అది తమ ఆచారమని వారు నమ్మకంగా చెప్తున్నారు మరి!..

# తెరపై తెలుగుసేన

(మొదటి పేజీ తరువాయి)

"తెలుగుదేశంతో పొత్తు వద్దు, సొంతంగానే పోటీ చేయాలి" అంటూ కొందరు కాపు ప్రముఖులతో పాటు, ఆయన వీరాభిమానులు (లేదా... టీడీపీ వీర ద్వేషులు) మీడియాలో గట్టి ప్రచారమే చేశారు. తెర వెనుక మాటలు కూడా నడిపారు. ఇక సోషల్ మీడియా సంగతైతే కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఫలితంగా జనసేన రాజకీయ గమనంపై పవన్ మైండ్‌సెట్ ఎలా ఉంటుందో అని ఆ పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు, అభిమాన కాపు ప్రముఖులు, వ్యక్తిగత శ్రేయోభిలాషులు కూడా ఒకింత ఆందోళనకు లోనయ్యారు. 'తెలుగుదేశం'తో పొత్తు లేకుండా సొంతంగా పోటీచేస్తే, ఫలితం ఎలా ఉంటుందో వారికి తెలుసు కనుకనే, వాళ్ళు టెన్షన్ పడ్డారు. ఓ అయిదారుగురికి మినహా డిపాజిట్లు సైతం వచ్చే పరిస్థితి ఉండదు.

పవన్ కళ్యాణ్‌కు కూడా స్వయంగా ఈ అనుభవం ఉంది. కాబట్టే టీడీపీతో పొత్తుకే ఆయన 100% కట్టుబడి, ముందుకు వెళ్లారు. చంద్రబాబు అరెస్టును అవకాశంగా తీసుకుని, పవన్ చొరవ తీసుకున్నారు. ఫలితంగా 'తెలుగు–సేన'తో రెండు పార్టీలూ ఇప్పుడు జనం ముందుకు వచ్చాయి.

ఈ "పొత్తు" ఇంత త్వరగా, ఇంత కూల్‌గా, ఇంత స్పష్టంగా, ఏ మాత్రం అపోహలు లేకుండా, నిశ్చబ్దంగా ఏర్పడ డానికి మాత్రం... చంద్రబాబు అరెస్టే కారణం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన అరెస్ట్ కనుక లేకపోయి ఉన్నట్టు అయితే ఆయన మానాన ఆయన, ఈయన పాటికి ఈయన జనంలో తిరుగుతూ... ఎవరి డప్పు వారు కొట్టుకుంటూ ఉండేవారు. ఒకరి గోల ఇంకొకరికి పట్టేది కాదు.

తెలుగుదేశం – జనసేనకు సంబంధించినంతవరకు జగన్ ప్రభుత్వం 'సరైన సమయంలో.... సరైన సహాయమే' చేసిందనే చెప్పాలి. ఎన్నికల నోటిఫికేషన్ వరకూ చంద్రబాబును రాజమండ్రిలో ఉంచినా లోకేష్ – పవన్ ప్రశాంతంగా 'పని' చేసుకుంటారు అనిపించేంతగా ఈ ఇద్దరి మధ్య ఈక్వేషన్ కుదిరిందనే సంకేతం స్పష్టంగా వచ్చేసిందన్నది విశ్లేషకుల ఆలోచన.

చంద్రబాబుకు ఏసీ సౌకర్యం కల్పించారు, ఇంటి భోజనం అనుమతించారు. మందులు, వైద్య సదుపాయాలకు లోటు లేదు. వైద్యులు రోజుకు రెండు, మూడు సార్లు పరీక్షిస్తున్నారని వార్తలు వచ్చాయి. కుటుంబసభ్యులు, న్యాయవాదులు రోజూ రెండుసార్లు కలవడానికి అడ్డంకి ఉన్నట్టు లేదు. అందువల్ల, ఆయన ప్రశాంతంగా ఉంటేనే... టీడీపీ గ్రాఫ్ కూడా పెరుగుతుంటుంది. మరి, ఆ రెండు పార్టీల నేతలకు ఇంత సాయం చేసిపెట్టిన సీఎం జగన్‌కు, ఆయన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు చెబుతారా... లేక, సహజ రాజకీయ గుణాన్ని ప్రదర్శించి విశ్వాస ఘాతుకులుగానే మిగిలిపోతారా తెలియదు. తెలుగు సాంస్కృతిక నగరమైన రాజమహేంద్రవరంలో తెలుగుదేశం – జనసేన 'సంయుక్త కార్యాచరణ' సమావేశానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయంటున్నారు విశ్లేషకులు.

అవేమనగా....

1. ఈ రెండు పార్టీలలో ఒకరు ఎక్కువ... ఒకరు తక్కువ అనే భావం ఎక్కడా జనానికి కలగలేదు. రెండు పార్టీల నేతలూ పరస్పరం సమాన గౌరవ, మర్యాదలతో వ్యవహరించిన భావమే కలిగింది.

2. పవన్ కళ్యాణ్‌లో అనూహ్యమైన రాజకీయ పరిణతి కనిపించింది. ఆయన ట్రేడ్ మార్క్ అయిన 'ఆవేశం', 'దూకుడు' – మచ్చుకు కూడా కనిపించలేదు.

3. తెలుగుదేశం పార్టీ యువనేత, పార్టీకి "ఉత్తరాధికారి" నారా లోకేష్‌తో పవన్ సగౌరవంగా వ్యవహరించడం, పవన్‌లోని రాజకీయ పరిపక్వతకి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

4. ఏ పొత్తు అయినా... సహజంగా సీట్ల పంపకం, బేర సారాలతో మొదలవుతుంది. కుదిరితే, నవ్వు మొహాలతో మీడియా ముందుకు వచ్చి నవ్వులు చిందిస్తూ, కరచాలనాలు చేసుకుంటారు. బేరం కుదరకపోతే, ఒకరిని ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ, ఎవరి దారిన వారు పోతారు. కానీ, "రాజమండ్రి డిక్లరేషన్"లో సీట్లు, పదవుల ప్రస్తావనే లేదు.

5. అర్జునుడు..., చెట్టు మీద ఉన్న పిట్ట కన్నుకు మాత్రమే తన విల్లంబును గురిపెట్టినట్టుగా.. "తెలుగు–సేన" వైసీపీని ఓడించాలి అనే లక్ష్యం దిశగా తొలి అడుగు వేసింది.

ఈ సమావేశంలో మరి కొన్ని ప్రత్యేకతలేమిటంటే....

ఆంధ్రలో టీడీపీతో టై–అప్ అయిన పవన్ తెలంగాణలో టీడీపీ ఊసు లేకుండా బీజేపీతో కలవలేరు. ఆంధ్రాలో కూడా, బీజేపీ–తెలుగు–సేనతో కలిస్తేనే తెలంగాణలో బీజేపీకి ఆ రెండు పార్టీల మద్దతు ఉండవచ్చు.

ఇక, టీడీపీ విషయానికి వస్తే నారా లోకేష్... తన బాడీ లాంగ్వేజ్, మాటలో మెచ్యూరిటీ, ఆచి... తూచి మాట్లాడిన తీరు చూసిన వారికి, "అవును. చంద్రబాబుకు ఇతడు సరైన వారసుడే" అనిపించింది. సరే... అన్నీ బాగానే కుదిరాయి. అయితే, ఇల్లు అలకగానే పండుగ కాదు అన్నారు కదా.. పెద్దలు. ఈ రెండు పార్టీల అగ్రనేతలు తమ తమ 'ఈగో'లను పక్కన బెట్టి, తమ కలయికపై సానుకూల సందేశాన్ని జనంలోకి బలంగా పంపించారనడంలో సందేహం లేదు. సినిమా భాషలో చెప్పాలంటే, "మంచి టీజర్" రిలీజ్ చేశారు. దీంతో, విడుదల కావలసి ఉన్న "అసలు సినిమా"పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

అయితే, ఆ సినిమా సూపర్ హిట్ అవుతుందా లేదా అన్నది అనేక అంశాల మీద ఆధారపడి ఉంటుందని "తెలుగు –సేన" నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు గమనించాలి.

అప్పుడే, "ఫ్రెండ్లీ" న్యూస్ ఛానెల్స్ రంగంలోకి దిగేశాయి.

జనసేనకు ఎన్ని సీట్లు? ఎవరు పెద రాయుడు పాత్ర పోషిస్తారు? కార్యకర్తలు కలిసి పనిచేస్తారా? సీట్లు పోయే టీడీపీ నేతలు సహకరిస్తారా? ఈ పొత్తు ఎన్నాళ్ళు అంటూ ప్రశ్నలు లంకించుకున్నాయి.

అంటే... టీడీపీ –సేన బంధానికి తూట్లు పొడిచే కార్యక్రమం అప్పుడే మొదలైపోయినందున రెండు పార్టీల నేతలూ ఎంత సంయమనంతో వ్యవహరిస్తారో చూడవలసి ఉంది. వీటికి తోడు, "తెలుగు –సేన" సినిమాకు అనేక ప్రతిబంధకాలు సహజం.

ఇలా కూడా జరగొచ్చు....

- సినిమా తెరపై ఆడాల్సిన సమయంలో మాటి మాటికీ థియేటర్‌లో కరెంటు పోవచ్చు.
- సాంకేతిక కారణాల వల్ల, జెనరేటర్‌లు పని చేయకపోవచ్చు.
- థియేటర్‌లో ఏసీలు పనిచేయక, జనం బయటకు పరుగులు తీయవచ్చు.
- టికెట్లు కొనేవారికి, అంతంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని ఇన్‌కం టాక్స్, సీబీఐ, ఈడీ వాళ్ళు నోటీసులు ఇస్తారనే ప్రచారం జరిగి, సినిమా చూద్దామనుకునే వారు, "ఎందుకొచ్చిన న్యూసెన్స్ లే" అనుకుంటూ ఇళ్ళకే పరిమితమైపోవచ్చు.
- ఈ సినిమాకు పోటీగా పక్క థియేటర్‌లో విడుదల అయ్యే సినిమా చూసే వారికి... ఇంటర్వెల్‌లో చికెన్ బిర్యానీ, ఆడాళ్లకు బంగారు బొట్టు బిళ్ళ, మగాళ్లకు వెండి మొలతాడు ఉచితంగా ఇస్తారనే ప్రచారం ఊపందుకుని ఈ సినిమా బదులు ఆ సినిమాకే పోదామని "ప్రేక్షక మహాశయులు" అనుకోవచ్చు.
- తెలుగు – సేన సినిమా బుకింగ్ మొదలయ్యే సమయానికి, బుకింగ్ క్లర్క్‌లు... పక్క థియేటర్‌లోకి జంప్ అయిపోవచ్చు. అసలు మాయమై కూడా పోవచ్చు.
- అడ్వాన్స్ బుకింగ్ చేసుకుందాం అనుకుంటే, ఇంటర్నెట్ పనిచేయక పోవచ్చు.
- ఈ థియేటర్ ముందు ట్రాఫిక్ పోలీసులు నిలబడి, వాహనాలు ఇక్కడ ఆపారంటే, "అటెంప్ట్ టు మర్డర్ కేసులు పెడతాం, జాగ్రత్త" అని సినిమాకు వచ్చే జనాన్ని బెదిరించవచ్చు.
- అసలు సినిమా చిత్రీకరణలోనే అసంతృప్తులు, అలకలు ఉండవచ్చు. కొన్ని సీనులు రీ – షూట్ చెయ్యాల్సిన అవసరం రావచ్చు.

ఏ "సత్కార్యం" అయినా ఊహించిన స్థాయిలో విజయవంతం కావడానికి సవాలక్ష ప్రతిబంధకాలు ఏర్పడతాయి. "అవి ఉంటాయి" అనే ముందస్తు స్పృహ, అంచనాతోనే, "తెలుగు –సేన" అడుగులు వేయాలి. తొలి అడుగు అయితే, బలంగా పడింది. సెంటిమెంట్ కూడా పండింది. స్క్రిప్ట్ పకడ్బందీగా కుదిరింది. డైలాగ్స్ బాగున్నాయి. హిట్ కావడానికి కావలసిన లక్షణాలకు లోటు కనపడడం లేదు. ఇప్పుడున్న "పరిస్థితులలో" ఇంతకుమించిన సినిమా స్క్రిప్ట్‌ను రూపొందించడం సాధ్యం కాకపోవచ్చు.

ఇది... బహుశా, వచ్చే సంక్రాంతికి రిలీజ్ కావచ్చు.

పక్క థియేటర్‌లో అదే సమయానికి విడుదల అయ్యే మరో బలమైన సినిమాను తట్టుకుని, "రాజమండ్రి సినిమా" ఎలా ఆడుతుందో చూడాలనే ఉత్సుకత మాత్రం రాష్ట్రం అంతా రాజకీయవర్గాల్లో పెరిగిపోతుంది. అయితే పక్క థియేటర్‌లో విడుదల అవుతుంది అనుకునే సినిమా మామూలు సినిమా కాదు. రాంగోపాల్ వర్మ మార్కు శృంగారం, హింస, ప్రేమ, హాస్యం, క్రైమ్, మొదలైన "జన రంజక" అంశాలతో మోస్ట్ కలర్‌ఫుల్‌గా, బలంగా ఉంటుంది. నిగ్రహించుకోవడం కష్టం. నిర్మాతలు ఎవరి అంచనాలు వారికున్నా, ప్రేక్షకుడి( ఓటరు)కి మాత్రం ఏ సినిమాని సూపర్ హిట్ చేయాలో అన్న స్పష్టత ఉంది. ఏం జరుగుతుందో చూద్దాం!






## కాలధర్మం

### జేకే రెడ్డికి సతీ వియోగం!



సంచలనాత్మక, వివాదరహిత, విలువలున్న రాజకీయ నాయకుడిగా జిల్లాలో పేరున్న నెల్లూరు మాజీ శాసనసభ్యులు జేకే రెడ్డి సతీమణి శ్రీమతి సులోచనమ్మ తన 77వ యేట కన్నుమూశారు. గత కొంతకాలంగా అస్వస్థతో హైదరాబాదులోని కుమార్తె ఇంట్లో ఉంటూ అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్టోబర్ 21వ తేదీ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. కనుపర్తిపాడు వాస్తవ్యులు వాసా యానాదిరెడ్డి – రమణమ్మల రెండవ సంతానం సులోచనమ్మ. రమణమ్మ జేకే రెడ్డికి స్వయానా మేనత్త. 1963 అక్టోబర్ 31న తన 17వ ఏటనే మేనమామ కొడుకు కోదండరామిరెడ్డిని పరిణయమాడి జక్కా వారి కోడలయ్యారు సులోచనమ్మ.

తొలి దశలో వ్యవసాయం ఆ తరువాత, కాంట్రాక్టు రంగం, అనంతరం రైస్ మిల్లులు, సినిమా హాళ్లు వంటి వ్యాపారాలు, చివరిగా రాజకీయాలు. ఇలా ఏదో ఒక వ్యాపకంతో ఎప్పుడూ క్షణం తీరిక లేకుండా ఉండే జేకే రెడ్డి కుటుంబ బాధ్యతలన్నీ సులోచనమ్మే చూసుకునేవారు. జేకేరెడ్డి – సులోచనమ్మ దంపతులకి ముగ్గురు సంతానం. పెద్దబ్బాయి రామ్మోహన్ కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో కాలం చేశారు. రెండవ కుమారుడు జనార్దన్ చెన్నైలో స్థిరపడినా, నెల్లూరుని వదల్లేదు. మూడవ సంతానం అమ్మాయి పద్మజ, వివాహం అనంతరం హైదరాబాదులో సెటిలయ్యారు. తన బిడ్డల ఆలనాపాలనా చూసుకోవడంతో పాటు తన మెట్టినింటి వారినీ, పుట్టింటి వారినీ సమానంగా చేరదీసి వారి అవసరాలని గమనిస్తూ ఉండేవారు సులోచనమ్మ. ఇంటికి రెండవ కోడలైనప్పటికీ, చొరవ తీసుకుని తానే బాధ్యతలన్నీ చక్కబెట్టేవారు ఆమె. జేకే రెడ్డి రాజకీయాలలోకి వచ్చాక ఇంటికి ఎవరొచ్చినా ఆప్యాయంగా పలుకరించి ఆతిథ్యం ఇచ్చేవారు. జేకే రెడ్డిని కలవడానికి వచ్చేవారు ఎవరైనా ఇంట్లోకి వెళ్లి సులోచనమ్మని పలకరించి రావలసిందే. అంతలా అందరితో కలసిపోయేవారు సులోచనమ్మ. గత కొంతకాలంగా ఆమె కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా చివరిలో క్యాన్సర్ మహమ్మారి ఆమెను పొట్టన పెట్టుకుంది. ఆమె పెద్ద కుమారుడు రామ్మోహన్ కుమార్తె వివాహం నవంబర్ 9న జరగనుంది. ఈలోపే మృత్యువు సులోచనమ్మని కబళించింది. అరవై ఏళ్లుగా తనకు తోడుగా ఉన్న సతీమణి తన ఎనభై ఏళ్ళ ప్రాయంలో తనని విడిచి వెళ్లిపోవడంతో కుమిలిపోతున్న జేకే రెడ్డికి, ఇతర జక్కా కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

### బత్తిన హేమనాథ్ రెడ్డి



బత్తిన హేమనాథ్ రెడ్డి తన 73వ ఏట అక్టోబర్ 19న చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన గత కొంత కాలంగా అస్వస్థతతో ఉంటూ మృత్యువుతో పోరాడి ఓడిపోయారు. ఆయన స్వగ్రామం నెల్లూరుజిల్లా, కొడవలూరు మండలం పాతవంగల్లు. హేమనాథ్ రెడ్డికి భార్య భారతమ్మ, ముగ్గురు కుమార్తెలు మోహిని, ప్రవీణ, బబిత ఉన్నారు. హేమనాథ్ రెడ్డి పెద్దన్న తొలసిరామిరెడ్డి యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ సంస్థలో సీనియర్ డివిజనల్ మేనేజర్‌గా పదవీ విరమణ పొందారు. చిన్నన్న బత్తిన కుమారస్వామిరెడ్డి ప్రథమ శ్రేణి కాంట్రాక్టర్‌గా జిల్లాలో ప్రసిద్ధి. వారి స్వగ్రామం పాతవంగల్లు అయినప్పటికీ, బత్తిన కుటుంబం అనాదిగా నెల్లూరులో స్థిరపడిపోయింది. అన్న కుమారస్వామిరెడ్డికి తోడుగా హేమనాథ్ రెడ్డి కాంట్రాక్టు రంగంలో ఉంటూ అన్న చేపట్టిన పనులను పర్యవేక్షిస్తుండేవారు.

హేమనాథ్ రెడ్డి పెద్దల్లుడు(మోహిని భర్త) కొండా నిరంజన్‌రెడ్డి జిల్లా వాసులకు చిరపరిచితులే. భార్గవి ఆటోమొబైల్స్, షిరిడీషా హోండా తదితర సంస్థల ద్వారా మారుతి సుజుకి కార్లు, హోండా మోటారుసైకిళ్లు, మోపెడ్లు వంటి వాహనాల విక్రయాలలో నెల్లూరు, తిరుపతి జిల్లాలలో నిరంజన్‌రెడ్డి సంస్థలు ప్రసిద్ధి. హేమనాథ్ రెడ్డి రెండవ అల్లుడు(ప్రవీణ పతి) సతీష్‌రెడ్డి కస్టమ్స్ మరియు సెంట్రల్ ఎక్సైజ్ విభాగంలో కమిషనర్‌గా కేంద్ర సర్వీసులలో పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. మూడవ అల్లుడు (బబిత బెటర్ హాఫ్) చిత్తరంజన్ వ్యాపారవేత్తగా అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడిపోయారు. హేమనాథ్‌రెడ్డికి ఆరుగురు మనుమలు మనుమరాళ్ళు ఉన్నారు. కుటుంబ పెద్దని కోల్పోయి శోకసముద్రంలో ఉన్న హేమనాథ్‌రెడ్డి కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న పోలీసులు

అక్టోబరు 21.. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా, వారి త్యాగాలు చిరస్మరణీయమంటూ జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది స్మరించుకున్నారు. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసుల సేవలను తలచుకుంటూ జిల్లావ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించి శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల కీలకపాత్రను ప్రజలకు వివరించనున్నారు. ఈ ఏడాది జిల్లాలో విధి నిర్వహణలో కొందరు, అనారోగ్యానికి గురై కొందరు, రోడ్డు ప్రమాదాల్లోనూ మొత్తం 18మంది మరణించారు. వారి సేవలను గుర్తుచేసుకుంటూ



జిల్లా ఎస్పీ డా. కె.తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని పోలీసుపెరేడ్ గ్రౌండ్‌లో పోలీసులు అమరవీరుల సంస్మరణ దినాన్ని జరుపుకున్నారు. అమరవీరుల స్మృత్యర్థం 'స్మృతి పెరేడ్' నిర్వహించి, అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ట్రైనీ కలెక్టర్ వి.సంజనాసిన్హా, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, మేయర్ స్రవంతి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ చిరంజీవిరెడ్డి, ఏఎస్పీలు ప్రసాద్, శ్రీనివాసరావు, డిఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులు, పోలీసు అధికారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అలరించిన చిన్నారుల నృత్యాలు



శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నెల్లూరు మూలాపేటలో కొలువైవున్న భువనేశ్వరీదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఇటీవల మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమీ చిన్నారుల కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆ చిన్నారులను మెచ్చుకుంటూ కొడవలూరుకు చెందిన నేతాజీ అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు కోవూరు వెంకి ఆ చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులందజేసి అభినందించారు.

# వ్యవస్థలు మేనేజ్ అవుతున్నాయా!?



'వ్యవస్థలను మేనేజ్ చేసి....'

ఈ పదం వినడానికి బాగుంది. అనడానికి కూడా చాలా బాగుంటుంది. చదువు వంటబట్టని వారికి కూడా... నోరు సులభంగా తిరుగుతుంది.

దాంతో, ఈ వాక్యం గత నాలుగేళ్ళల్లో బహుళ ప్రచారంలోకి వచ్చింది. ఈ వాక్యంలో ఇమిడివున్న అంతరార్థం ఏమిటో తెలియకపోయినా, ఈ వాక్యాన్ని పదే పదే పలకడానికి... రాజ్యాంగ పరమైన, నైతికానైతిక పరమైన ఆంక్షలు ఏమీ లేవు.

'వ్యవస్థలను మేనేజ్ చేసి....' అని ఎవరైనా... ఎప్పుడైనా... ఏ కారణంతో అయినా అనవచ్చు. అలా అనే వారినీ ఎవరూ ఖండించరు, తప్పు పట్టరు కూడా. ఎందుకంటే.... ఇది గాలిలోకి విసిరే రాయి. కడుపులో ఒకటి పెట్టుకుని, పైకి ఇంకోటి మాట్లాడే మాట. ఎదుటివారిని ఉద్దేశించి చల్లే పేడ కళ్ళాపు.

వైసీపీ (జగన్) పాలన మొదలైన తరువాత, "వ్యవస్థలను మేనేజ్ చేసి..." అనే డైలాగ్ బాగా వాడుకలోకి, బహుళ ప్రచారంలోకి వచ్చినట్టు కనపడుతోంది.

అంతకుముందు నాటి రాజకీయాలలో ఈ వాక్య ప్రయోగం అంతగా వినియోగంలోకి వచ్చిన జ్ఞాపకం లేదు.

వైసీపీ పార్టీ ప్రభుత్వ నిర్వహణ పగ్గాలు చేపట్టిన తరువాత, ఏదో ఒక జీ.ఓ (గవర్నమెంట్ ఆర్డర్‌ను జీ.ఓ అంటుంటాం) ఇవ్వడం, దాన్ని బట్టుకుని ఎవరో ఒకరు హైకోర్టుకు వెళ్లడం, అక్కడ దాన్ని కొట్టేయడం అనే పరిణామాలు... మొదటి మూడు... మూడున్నర సంవత్సరాలలో రోజువారి న్యూస్‌గా మారి పోయాయి.

"హైకోర్టులో జగన్ ప్రభుత్వానికి చుక్కెదురు..." అనే శీర్షికను వార్తాపత్రికల్లో ఎన్నిసార్లు పెట్టారో.... జనం ఎన్నిసార్లు చదివారో లెక్కే లేదు. ఏదైనా హైకోర్టులో కేసుకు సంబంధించిన తీర్పుకు సంబంధించి, ఈ శీర్షిక వార్తాపత్రికల్లో కనిపించకపోతే కొంచెం ఆశ్చర్యం కూడా వేసేది.

ఈ తీర్పులను జీర్ణం చేసుకోవడం వైసీపీ పాలిత ప్రభుత్వ పెద్దలకు కొంచెం కష్టం అయ్యేది. నేరుగా కోర్టులను తప్పు పట్టేంతగా మన ప్రజాస్వామ్యం ఇంకా అభివృద్ధి చెందకపోవడంతో (ఆ ముచ్చట తీరడానికి ఎక్కువ కాలం పట్టకపోవచ్చు!), ఎవరో "వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు..." అనే థియరీ పురుడుపోసుకుంది.

ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి ఈ థియరీకి మంచి ప్రచారం కల్పించారు అనే చెప్పాలి.

ఈ ప్రచారానికి తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబునాయుడును లక్ష్యంగా చేసుకుని ఆయన తృప్తిపడేవారు.

ఆయనను ఆదర్శంగా తీసుకుని, వైసీపీలోని ఇతరులు కూడా ఇదే మాట మాట్లాడేవారు. దీంతో, "...... వ్యవస్థలను మేనేజ్ చేసి...." అనే మాట ఇంటింటికీ పాపులర్ అయిపోయింది.

అసలు 'వ్యవస్థలు' ఎన్నో లేవు. మూడో... నాలుగో ఉన్నాయి. అవి కూడా మేనేజ్ అయిపోతున్నాయి అనేది ఆరోపణలు.

ఈ ఆరోపణలు చేస్తున్నవారు... సందర్భాన్ని బట్టి ఆయా వ్యవస్థలను నిందిస్తున్నారో... మేనేజ్‌చేసే వారిని నిందిస్తున్నారో, ఈ రెండిటికీ అవకాశం ఇచ్చిన మన ప్రజాస్వామిక ప్రక్రియలోని లోపాన్ని ఎత్తి చూపుతున్నారో, వ్యవస్థలను తాము మేనేజ్ చేసుకోలేకపోతున్నామనే తమ నిస్సహాయతను బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారో తెలియదు.

175 అసెంబ్లీ స్థానాలలో 151 స్థానాలలో గెలిచి ప్రభుత్వ నిర్వహణను మొదటిసారిగా చేపట్టినందున, వ్యవస్థలను మేనేజ్ చేయలేకపోతున్నామనే భావన కూడా ఈ విమర్శ / ఆరోపణ / ఆక్రోశంలో ఇమిడి ఉన్నదేమో అనిపిస్తుంటుంది.

చంద్రబాబు నలభైఏళ్లకు పైబడి రాజకీయాలలో కొనసాగుతూ ఉండడం, మూడుసార్లు ముఖ్యమంత్రి పదవిని నిర్వహించి ఉండడంతో, 'వ్యవస్థలను మేనేజ్ చేయడం'లో ఆయనకు అపారమైన అనుభవం ఉండి ఉంటుందని సజ్జల రామకృష్ణారెడ్డి గానీ, ఇతర వైసీపీ నేతలు గానీ అభిప్రాయపడ్డారేమో తెలియదు.

కానీ, 151 సీట్లతో సర్వ బలాఢ్యులైన ప్రభుత్వ పాలక పెద్దలను కాదని, 23 సీట్లతో అత్యంత బలహీనంగా ఉన్న వారికి... వ్యవస్థలను మేనేజ్‌చేసే శక్తి ఉంటుందా? వ్యవస్థలు మేనేజ్ అవుతాయా?

ఇది... ఎవరికైనా కలిగే సింపుల్ కామన్ సెన్స్ పాయింట్.

అసలు ఎన్ని 'వ్యవస్థలు' ఉన్నాయి మనకు అని అడిగితే... ప్రధానంగా ఓ నాలుగు అని చెప్పవచ్చు.

1. శాసన వ్యవస్థ, 2. అధికార వ్యవస్థ, 3. న్యాయ వ్యవస్థ, 4. రాజకీయ వ్యవస్థ. ఎన్నికల సంఘం, కంట్రోలర్ & ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా వంటి (ఉత్తుత్తి) రాజ్యాంగ వ్యవస్థలు ఉన్నాయి గానీ, ప్రభుత్వాధికారం చేతిలో ఉన్న రాజకీయ వ్యవస్థల కనుసన్నల్లోనే ఇవి నడుచుకుంటూ ఉంటాయని మన అనుభవంలో కనపడుతుంది.






ఇక 'శాసన వ్యవస్థ' అంటే... పార్లమెంటు, శాసనసభ (శాసన మండలిని కూడా కలుపుకుని). ఇవి స్వతంత్రంగా పనిచేసే ప్రశ్నే లేదు కదా!

కేంద్ర ప్రభుత్వం ఏ రాజకీయ పార్టీ చేతుల్లో ఉంటే... పార్లమెంట్ కూడా వారి చేతుల్లోనే ఉంటుంది కదా! రాష్ట్రాల్లో శాసనసభల దీనస్థితి మరింత దారుణంగా ఉండడాన్ని మనం చూస్తున్నాం. ఈ 'వ్యవస్థ'లను అధికార పార్టీ ఎలా కావాలంటే.... అలా మేనేజ్ చేసుకోవచ్చు.

గతం నుంచీ చేసుకుంటూ వస్తున్నాయి. ఇప్పుడు చేసుకుంటున్నాయి. భవిష్యత్‌లోనూ మేనేజ్ చేసుకుంటాయి. అసలు అవి ఉన్నదే.... అధికార పక్షం మేనేజ్ చేసుకోడానికి అన్నట్టుగా ప్రభుత్వ నిర్వాహకులు వ్యవహరిస్తుంటారు!

ఇక, మిగిలింది, 'న్యాయ వ్యవస్థ'. ఇది మేనేజ్ చేయడంపైనే.... సజ్జల రామకృష్ణారెడ్డి గానీ, ఇతర వైసీపీ నేతలు గానీ మొదటి మూడున్నరేళ్ళల్లో మాట్లాడింది.

చంద్రబాబు వ్యవస్థల్ని మేనేజ్ చేస్తున్నారు అని.

అయితే, ఒక ఏడెనిమిది నెలలుగా చంద్రబాబుపై ఈ ఆరోపణ వినపడడం లేదు.

ఇప్పుడు తెలుగుదేశం నేతలు.... ఇదే ఆరోపణను సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రయోగిస్తున్నారు.

వ్యవస్థలను మేనేజ్‌చేసి, చంద్రబాబునాయుడును అక్రమ కేసుల్లో జైలుకు పంపి అక్కడే ఉంచుతున్నారని టీడీపీ నాయకుడు యనమల రామకృష్ణుడు మొన్న గవర్నర్‌ను కలిసి వచ్చాక ఆరోపించారు.

వైసీపీ వారు ఈ ఆరోపణలు చేసినంతకాలమూ టీడీపీ నేతలు నోరు మెదపలేదు. ఇప్పుడు టీడీపీ వారు అదే ఆరోపణ చేస్తుంటే.... వైసీపీ వారు స్పందించడం లేదు.

నిజానికి, ఈ రెండు పార్టీల నేతలు... పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటుంటున్నట్టు కనబడుతున్నప్పటికీ, ఇద్దరూ కలిసి తీస్తున్నది మాత్రం న్యాయ వ్యవస్థ పరువునే.

న్యాయ వ్యవస్థ వ్యవహారశైలిని మేనేజ్ చేయవచ్చని రెండు పార్టీల వారూ అభిప్రాయపడుతున్నారని... వారు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణను బట్టి ఎవరైనా ఒక అభిప్రాయానికి వచ్చే అవకాశం లేకపోలేదు.

కొద్దో... గొప్పో.... జనానికి ఇప్పటికీ కొంచెం నమ్మకం ఉన్నది న్యాయ వ్యవస్థ అని అంటారు. మిగిలిన వ్యవస్థలను మేనేజ్ చేయడమంత సులభం కాదు, న్యాయ వ్యవస్థ అనే అభిప్రాయం కూడా ఉంది.

ఇప్పుడు, రాజకీయాలలో ఉన్నవారి పరస్పర ఆరోపణలను బట్టి, ఆ వ్యవస్థను కూడా మిగిలిన వ్యవస్థల లాగానే మేనేజ్‌చేయడం పెద్ద కష్టం కాదు అనే భావం ఎవరికైనా కలగడం సహజం.

కాకపోతే, 'పట్టు' దొరకాలి. అది దొరికితే, ఇక తిరుగు లేదు.

మూడున్నరేళ్లుగా.... వైసీపీ ఆరోపణలకు స్పందించని టీడీపీ నేతలు, ఇప్పుడు వైసీపీపై అదే ఆరోపణలు చేస్తున్నారు అంటే.... వైసీపీకి 'పట్టు' దొరికిందా అనే అనుమానాలు కలగడం సహజం.

న్యాయ వ్యవస్థలో కూడా ఉండేది మన సమాజంలోని మనుషులే కదా! సమాజపు రంగు, రుచి, వాసన... బలాలు, బలహీనతలు వారిలోనూ ప్రతిఫలిస్తూ ఉంటాయి కదా!

వాటిని దృష్టిలో పెట్టుకునే అప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డి బృందం గానీ, ఇప్పుడు టీడీపీ బృందం గానీ న్యాయ వ్యవస్థ పరువుకు భంగకరంగా వ్యాఖ్యానాలు చేస్తున్నారేమో అనిపిస్తుంది. వీరు కూడా సమాజంలోని సమస్త రంగు, రుచి, వాసన, బల, బలహీనతలను ప్రతిబింబించే వారే కదా!

వారూ.... వీరూ ఆరోపిస్తున్నట్టుగా ఇక న్యాయ వ్యవస్థ కూడా మేనేజ్ అయిపోతుంటే... ఇక, దేవుడే దిక్కు.

నిజానికి, రాజకీయ ప్రత్యర్థులపై ఈ తరహా ఆరోపణ చేసేవారికి.... న్యాయస్థానమే సూమోటోగా నోటీసులు జారీ చేయాలి. 'ఈ ఆరోపణ చేయడంలో మీ ఉద్దేశం ఏమిటి? ఏ వ్యవస్థను మేనేజ్ చేశారు? ఎలా చేశారు? మీ దగ్గర రుజువులు ఉన్నాయా? ఏమిటి అవి?' అని నిలదీస్తే, ఈ ఆరోపణల కాలుష్యం రాజకీయాల్లో కొంత తగ్గి, న్యాయ వ్యవస్థ బలహీనతలు పబ్లిక్ డొమైన్‌లోకి రాకుండా చూడవచ్చు.

కానీ, న్యాయవ్యవస్థ కూడా ఈ ఆరోపణలను లైట్ తీసుకుంటున్నట్టు ఉంది.

కందకు లేని దురద పెండలానికి ఎందుకనే సామెత చందంగా... తమ ప్రతిష్ఠ కాపాడుకోవడం పట్ల న్యాయ వ్యవస్థకే లేని ఆసక్తి... ఇతరులకు మాత్రం ఎందుకుంటుంది?

**- భోగాది వేంకట రాయుడు**
శాన్ఫ్రాన్సిస్కో నుండి...
medhomadhanam@gmail.com

# ఉత్తరక్రియలు



జననం : 1946

నిర్యాణం : 2023

మా కుటుంబ అభివృద్ధికి స్ఫూర్తిప్రదాత
ప్రేమామృతాలను పంచిన అనురాగదేవత

## శ్రీమతి జక్కా సులోచనమ్మ గారు

అక్టోబర్ 21, 2023, శనివారం స్వర్గస్తురాలైనారు.

**వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...**

భర్త : **జక్కా కోదండరామరెడ్డి (జె.కె.రెడ్డి)**
మాజీ శాసనసభ్యులు, నెల్లూరు.

కుమారులు - కోడళ్ళు
**జక్కా వినూజ రామ్మోహన్**
**జక్కా జనార్ధన్‌రెడ్డి - స్మిత**

కుమార్తె - అల్లుడు
**పద్మజ**
**ఏ.బి.వి. రమణారెడ్డి**

మనుమళ్ళు మనుమరాళ్ళు
**జక్కా రిధి, జక్కా మనవ్, జక్కా కోదండ శ్రీవత్స**
**ప్రియదర్శిని వెంకట్, యామిని వెంకట్**

### ఉత్తరక్రియలు

వారి పెద్దకర్మ తేది. 02.11.2023 గురువారం మధ్యాహ్నం 12.00 గంటలకు
నెల్లూరు, దర్గామిట్టలోని శ్రీ కస్తూరిదేవి విద్యాలయం (హైస్కూలు) ప్రాంగణంలో జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com